సాక్షి అనంతపురం

బుధవారం ၊ 6 ၊ ఆగస్టు ၊ 2025



చీనీ టన్ను రూ.14 వేలు

అనంతపురం మార్కెట్‌యార్డులో మంగళవారం చీనీకాయలు టన్ను గరిష్ట ధర రూ.14 వేలు పలికాయి.



టమాట కిలో రూ.47

అనంతపురం కక్కలపల్లి మండీలో మంగళవారం కిలో టమాట గరిష్ట ధర రూ.47 పలికింది. కనిష్టం రూ.30, సరాసరి రూ.40 ప్రకారం క్రయ విక్రయాలు జరిగాయి.

గరిష్ఠం/కనిష్ఠం
36.8°/ 22.3°

జిల్లా అంతటా మంగళవారం ఉష్ణోగ్రతలు స్వల్పంగా పెరిగాయి. గాలివేగం స్వల్పంగా తగ్గింది. ఆకాశం పాక్షికంగా మేఘావృతమై అక్కడక్కడా తేలికపాటి నుంచి తుంపర్లు పడ్డాయి. నైరుతి దిశగా గంటకు 6 నుంచి 12 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.

న్యూస్‌రీల్

15 వరకు 'హర్ ఘర్ తిరంగ'

- ఇన్‌చార్జ్ కలెక్టర్ శివ్ నారాయణ్ శర్మ



అనంతపురం అర్బన్: ''అజాదీ కా అమృత్ మహోత్సవ్‌లో భాగంగా ఈనెల 15 వరకు హర్ ఘర్ తిరంగ ప్రచారాన్ని ఘనంగా నిర్వహించాలి. నిర్దేశించిన విధంగా కార్యక్రమాలు చేపట్టాలి' అని ఇన్‌చార్జ్ కలెక్టర్ శివ్ నారాయణ్ శర్మ అన్నారు. మంగళవారం కలెక్టరేట్ నుంచి అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని శాఖలతో సమన్వయం కోసం జిల్లా పర్యాటక అధికారి నోడల్ అధికారిగా వ్యవహరిస్తారన్నారు. షెడ్యూల్ ప్రకారం గ్రామ, మండల, జిల్లాస్థాయిలో కార్యక్రమాలు నిర్వహించాలని ఆదేశించారు. 13న తిరంగ ర్యాలీలతో పాటు స్వాతంత్ర్య సమరయోధులు, వారి కుటుంబాలను సన్మానించాలని, మునిసిపల్ కమిషనర్లు ఈ కార్యక్రమం చేపట్టాలని చెప్పారు. ప్రధాన ప్రదేశాల్లో దేశభక్తి గీతాలు, తిరంగ యాత్రలు నిర్వహించాలన్నారు. 14న జిల్లాస్థాయి నుంచి గ్రామ, వార్డు స్థాయి వరకు తిరంగ యాత్ర నిర్వహించాలని డీపీఓని ఆదేశించారు. 15న అన్ని విభాగాలు జాతీయ జెండా ఎగురవేయాలన్నారు. అధికారులందరూ సమన్వయంతో పనిచేసి కార్యక్రమాలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

పనులు పెండింగ్ ఉంచొద్దు

అనంతపురం అర్బన్: 'గ్రామ, వార్డు సచివాలయాలకు సంబంధించి అంశాలు పెండింగ్ ఉండకూడదు. వాటిని సత్వరమే పూర్తి చేయాలి. విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరించే వారిపై చర్యలు ఉంటాయి. నెగెటివ్ ఫీడ్‌బ్యాక్ ఉన్న అధికారులకు మెమోలు జారీ చేయండి' అని ఇన్‌చార్జ్ కలెక్టర్ శివ్ నారాయణ్ శర్మ అన్నారు. కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాలు నుంచి డీపీఓ, డీఎల్‌డీఓ, ఎంపీడీఓలు, మునిసిపల్ కమిషనర్లు, ఈఓఆర్‌డీలతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఆయన సమీక్షించారు. సచివాలయాల్లో క్యూఆర్ కోడ్ ఉంచి ప్రజల నుంచి ఫీడ్‌బ్యాక్ తీసుకోవాలని చెప్పారు. పనుల్లో రోజూ పురోగతి కనిపించాలన్నారు. నెగెటివ్ ఫీడ్‌బ్యాక్ ఉన్న మండలాలను గుర్తించి ఆయా ఎంపీడీఓలకు మెమోలు జారీ చేయాలని ఆదేశించారు. పెండింగ్‌లో ఉన్న 'తల్లికి వందనం' ఫిర్యాదులు రెండు రోజుల్లో పూర్తి చేయాలని సూచించారు. ఇంటింటి చెత్త సేకరణ సక్రమంగా జరగడం లేదనే ఫిర్యాదులు చాలా మండలాల నుంచి వస్తున్నాయని అసంతృప్తి వ్యక్తం చేశారు. సమావేశంలో అసిస్టెంట్ కలెక్టర్ సచిన్ రహర్, సీపీఓ అశోక్‌కుమార్‌రెడ్డి, జెడ్పీ సీఈఓ శివశంకర్, డీపీఓ నాగరాజునాయుడు, హౌసింగ్ పీడీ శైలజ, జీఎస్‌డబ్ల్యూఎస్ జిల్లా కో–ఆర్డినేటర్ ధనుంజయ తదితరులు పాల్గొన్నారు.

బూతులు తిట్టి.. స్టేషన్‌లో కూర్చోబెట్టి!

- దళిత కుటుంబంపై బ్రహ్మసముద్రం ఎస్‌ఐ దాష్టీకం



బ్రహ్మసముద్రం పోలీసుస్టేషన్ ఎదుట నిరసన తెలుపుతున్న బాధిత కుటుంబం

బ్రహ్మసముద్రం: న్యాయం చేయమని వచ్చిన తమను ఎస్‌ఐ నానా బూతులు తిట్టడమే కాకుండా పోలీసు స్టేషన్‌లో కూర్చోబెట్టారని ఓ దళిత కుటుంబం ఆవేదన వ్యక్తం చేసింది. ఆలస్యంగా వెలుగులోకి వచ్చిన ఈ ఘటనపై బాధితులు తెలిపిన మేరకు.. బ్రహ్మసముద్రం మండలం బొబ్బర్లపల్లికి చెందిన మారెన్న కుమార్తె పొలంలోని వేరుశనగ పంటను ఆదివారం కొందరు గొర్రెలతో మేపారు. దీనిపై ఫిర్యాదు చేయడానికి బాధితురాలు బ్రహ్మసముద్రం పోలీసుస్టేషన్‌కు వెళ్లగా.. ఎస్‌ఐ నరేంద్రకుమార్ న్యాయం చేస్తామని చెప్పి ఆమెను వెనక్కి పంపారు. సోమవారం ఆమె మళ్లీ తన భర్తతో పాటు తండ్రి మారెన్నతో కలిసి పోలీసుస్టేషన్‌కు వెళ్లింది. ఈ క్రమంలోనే వారిపై ఎస్‌ఐ నరేంద్ర కుమార్ రెచ్చిపోయారు. తప్పుడు కేసులు పెడతారా అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. నానా బూతులు తిట్టారు. న్యాయం చేయాలని కోరితే ఇలా మాట్లాడడం తగదని మారెన్న అనగా.. ఎస్‌ఐ మరింత రెచ్చిపోయారు. నువ్వెవరు తప్పుడు నా కొ.. అంటూ దాష్టీకం ప్రదర్శించారు. మారెన్నతో పాటు ఆయన కుమార్తె, ఆమె భర్తను స్టేషన్‌లో కూర్చోబెట్టారు. పెద్ద మనిషిగా వచ్చిన తనను ఎందుకు కూర్చోమంటున్నారని మారెన్న అంటే.. అన్నీ నీకు చెప్పాలా అంటూ తిట్టి అక్కడి నుంచి వెళ్లిపోయారు. మళ్లీ సాయంత్రమైనా ఎస్‌ఐ తిరిగి రాకపోవడంతో బాధిత దళిత కుటుంబం పోలీసు స్టేషన్ ముందు బైఠాయించి నిరసన తెలిపింది. దళితులమైన తమ పట్ల అత్యంత దారుణంగా వ్యవహరించిన ఎస్‌ఐపై ఉన్నతాధికారులు తగిన చర్యలు తీసుకోవాలని మారెన్న కోరుతున్నారు.

పాలకుల చేతకానితనంతో జిల్లా రైతాంగానికి తీరని అన్యాయం జరుగుతోంది. నెల రోజులుగా దాదాపు 200 టీఎంసీల తుంగభద్ర, కృష్ణా జలాలు దిగువకు వెళ్లిపోయాయి. కానీ జిల్లాకు వచ్చింది మాత్రం 5 టీఎంసీలే. ఈ ఏడాది వర్షాలతో జలాశయాలు ముందుగానే నిండినా జిల్లాకు మాత్రం అనుకున్న స్థాయిలో నీరు చేరకపోవడం గమనార్హం.



తుంగభద్ర జలాశయం నుంచి నదికి పోతున్న నీరు

జలాశయాలు కళకళ... ఆయకట్టు వెలవెల

- నీటి ప్రణాళికలపై చేతులెత్తేసిన పాలకులు
- ఆశగా అన్నదాతల ఎదురుచూపులు
- ఉమ్మడి జిల్లాలో ముగ్గురు మంత్రులున్నా ఇదీ దుస్థితి



హెచ్చెల్సీలో ఆంధ్రా సరిహద్దు 105వ కిలోమీటర్ వద్ద ప్రవహిస్తున్న తుంగభద్ర జలాలు

అనంతపురం సెంట్రల్: హెచ్చెల్సీ, హంద్రీ–నీవా ప్రాజెక్టుల ద్వారా జిల్లాకు సాగు, తాగునీటిని అందిస్తున్నారు. తుంగభద్ర జలాశయం నుంచి హెచ్చెల్సీకి గ్రావిటీ ద్వారా, శ్రీశైలం జలాశయం నుంచి హంద్రీ–నీవాకు ఎత్తిపోతల ద్వారా నీటిని తీసుకొస్తున్నారు. రెండు ప్రాజెక్టుల నుంచి సరైన సమయంలో నీరు తీసుకుంటేనే జిల్లాకు న్యాయం జరుగుతుంది. అయితే, ఈ ఏడాది పనులు జరుగుతున్నాయనే ఉద్దేశంతో నీటిని తీసుకోవడంలో తీవ్ర జాప్యం చేశారు. ఆలస్యం కారణంగా ఇప్పటి వరకూ 5 టీఎంసీల నీరు మాత్రమే జిల్లాకు చేరాయి. తుంగభద్ర జలాశయం నుంచి హెచ్చెల్సీకి 1.875 టీఎంసీలు విడుదల చేయగా జిల్లా సరిహద్దులోకి 1.688 టీఎంసీలు చేరాయి. ప్రస్తుతం జిల్లా సరిహద్దులో 1,796 క్యూసెక్కుల నీటి ప్రవాహం కొనసాగుతోంది. హంద్రీ–నీవా ద్వారా ఇప్పటి వరకూ 3.78 టీఎంసీలు వచ్చాయి. జీడిపల్లి జలాశయం నిండిన తర్వాత పీఏబీఆర్‌కు నీటిని మళ్లించారు.

సమీక్షించిన పాపాన పోలేదు..

హెచ్చెల్సీ, హంద్రీ–నీవా ద్వారా జిల్లాలో లక్ష ఎకరాలకు పైగా సాగునీరు అందించవచ్చు. అలాగే, వందలాది చెరువులను నింపడం ద్వారా భూగర్భ జలాలు అడుగంటి పోకుండా చర్యలు చేపట్టవచ్చు. ఈ క్రమంలో ఈ ఏడాది తుంగభద్ర, శ్రీశైలం జలాశయాలు ముందుగానే నిండడంతో ఆయకట్టు రైతుల్లో ఆశలు చిగురించాయి. కానీ ఉమ్మడి జిల్లాలో ముగ్గురు మంత్రులున్నా... ఇంత వరకూ నీటి ప్రణాళికలపై సమీక్షించిన పాపాన పోలేదు. ఈ క్రమంలో జూన్‌లోనే జలాశయాలు పూర్తిగా నిండినా ఇప్పటి వరకూ పట్టుమని పది టీఎంసీలు తీసుకురాలేకపోయారు. క్షేత్రస్థాయిలో రైతుల నుంచి నీటి విడుదలకు డిమాండ్ నెలకొంది. నీరు విడుదల చేస్తే ఆయకట్టు కిందే కాకుండా పరివాహక ప్రాంతాల్లో బోరుబావుల కింద పంటలను రక్షించుకుంటామని పేర్కొంటున్నారు. జిల్లాలోని రిజర్వాయర్లలో తగినంతగా నీటి నిల్వలు లేకపోవడంతోనే ఐఏబీ సమావేశం నిర్వహించలేకపోతున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి.

ఆగస్టు 15 తర్వాత నిర్ణయం

తుంగభద్ర జలాశయం నుంచి వీలైనంత ఎక్కువ నీటిని తీసుకురావడానికి కృషి చేస్తున్నాం. పీఏబీఆర్‌లో పూర్తిస్థాయికి నీటి మట్టం చేరితే ఎంపీఆర్‌కు విడుదల చేస్తాం. తర్వాత ఆయకట్టుకు నీటిని అందిస్తాం. ఆగస్టు 15 తర్వాత ఐఏబీ సమావేశం నిర్వహణపై నిర్ణయం తీసుకుంటాం. ప్రస్తుతానికి గుంతకల్లు బ్రాంచ్ కెనాల్‌కు నీటిని విడుదల చేశాం. ఆలూరు బ్రాంచ్ కెనాల్‌కు హంద్రీ–నీవా ద్వారా అందిస్తున్నాం. టీబీ డ్యాం నుంచి తొలుత 18 టీఎంసీలే కేటాయించారు. అది 24 టీఎంసీలకు పెరిగే అవకాశముంది. నీరు ఎక్కువ వస్తే అన్ని ప్రాంతాల్లోని ఆయకట్టుకు అందిస్తాం.

– సుధాకర్‌రావు, ఎస్‌ఈ, హెచ్చెల్సీ

55 రోజుల తర్వాత వర్షం



అనంతపురం బస్టాండ్ ప్రాంగణంలో నిలిచిన వర్షపు నీరు

అనంతపురం అగ్రికల్చర్: 55 రోజుల సుదీర్ఘ విరామం తర్వాత వరుణుడు కరుణించాడు. ప్రధాన పంటలు విత్తుకునే సమయం ముగిశాక వర్షం కురిసింది. సోమవారం రాత్రి నుంచి మంగళవారం ఉదయం వరకు 19.8 మి.మీ సగటు వర్షపాతం నమోదైంది. 15 మండలాల్లో పదును వర్షం కురవగా మిగతా మండలాల్లో తేలికపాటి నుంచి తుంపర్లు పడ్డాయి. బెళుగుప్ప మండలంలో అత్యధికంగా 90.8 మి.మీ భారీ వర్షం కురిసింది. అలాగే, డి.హీరేహాళ్ 58.2 మి.మీ, నార్పల 46.2, రాయదుర్గం 45.6, యల్లనూరు 39.2, కళ్యాణదుర్గం 32.2, ఉరవకొండ 30.2, యాడికి 28.4, కణేకల్లు 26.2, వజ్రకరూరు 22.4, పెద్దపప్పూరు 20.6, విడపనకల్లు 16.2, బ్రహ్మసముద్రం 15.4, గుంతకల్లు 15.2, తాడిపత్రి 13.4, శెట్టూరు 12.6, కంబదూరు 12.4, బొమ్మనహాళ్ 11.8, గార్లదిన్నె 10.6, గుమ్మఘట్ట 10.2 మి.మీ వర్షపాతం నమోదైంది. మిగతా మండలాల్లో తేలికపాటి వర్షం కురిసింది. ఆగస్టులో 83.8 మి.మీ గానూ ప్రస్తుతానికి 23 మి.మీ వర్షపాతం నమోదైంది. ఓవరాల్‌గా జూన్ 1 నుంచి 135.5 మి.మీ గానూ 22 శాతం తక్కువగా 105.6 మి.మీ నమోదైంది. ఈ రెండు నెలల్లో 8 వర్షపు రోజులు (రెయినీడేస్) నమోదయ్యాయి. కాగా, రాగల ఐదు రోజులూ ఉమ్మడి జిల్లాకు వర్ష సూచన ఉన్నట్లు రేకులకుంట వ్యవసాయ పరిశోధనా స్థానం ప్రధాన శాస్త్రవేత్త విజయశంకరబాబు, సీనియర్ శాస్త్రవేత్త నారాయణస్వామి తెలిపారు.

సరుకులే కాదు.. కార్లు, ఫ్రిజ్‌లు, కూలర్లూ..

- మాజీ సైనికోద్యోగులకు అనేక సౌలభ్యాలు
- అవగాహన లేక వినియోగించుకోని వైనం
- ఆన్‌లైన్‌లోనే అన్ని కార్యకలాపాలు

సాక్షి ప్రతినిధి, అనంతపురం: మిలిటరీ క్యాంటీన్ అంటే చాలామంది కేవలం నిత్యావసర సరుకులు, లిక్కర్ లభించే ప్రదేశమే అనుకుంటారు. అయితే, క్యాంటీన్ ద్వారా ఎన్నో సౌలభ్యాలు అందుబాటులో ఉన్నాయి. వాటి గురించి తెలియక చాలామంది మాజీ సైనికోద్యోగులు వినియోగించుకోవడం లేదు. శ్రీ సత్యసాయి, అనంతపురం జిల్లా వ్యాప్తంగా 2,200 మందికి పైగా మాజీ సైనికోద్యోగులు ఉన్నారు. వీరిలో చాలామంది తక్కువ ధరకు లభించే ఖరీదైన వస్తువులను వినియోగించుకోలేక పోతున్నారు. సమాచార లోపం కారణంగా భారీగా రాయితీలు కోల్పోతున్నారు.

కార్లు, టూవీలర్లు, ఫ్రిజ్‌లు, ఏసీలు కూడా

మాజీ సైనికోద్యోగులు నెలకు ఐదువేల రూపాయలకు వచ్చే సరుకులనే చూస్తున్నారు కానీ మిగతావి చూడటం లేదు. వాస్తవానికి క్యాంటీన్‌తో అవసరం లేకుండా కార్లు, ఫ్రిజ్‌లు, ద్విచక్రవాహనాలు, ఏసీ, ఎల్‌ఈడీ టీవీలు ఇవన్నీ తీసుకోవచ్చు. ఎక్కడికో వెళ్లాల్సిన అవసరం కూడా లేదు.. ఆన్‌లైన్ పోర్టల్ ద్వారా దరఖాస్తు చేసుకుని నేరుగా ఇంటికే కారు తెప్పించుకునే అవకాశం ఉంది. ఇందుకోసం మాజీ సైనికోద్యోగి ముందుగా ఆన్‌లైన్ పోర్టల్‌లో దరఖాస్తు చేయాలి. afd.csdindia.comలో ఒకసారి రిజిస్ట్రేషన్ చేసుకుంటే జీవితకాలం ఉంటుంది. కొత్త కార్డు కోసం csdsmartcard.com వెబ్‌సైట్‌కు వెళ్లి దరఖాస్తు చేసుకోవాలి. కారు లేదా టూవీలర్ కావాలంటే షోరూంకు వెళ్లి అవైలబిలిటీ సర్టిఫికెట్ తెచ్చి పోర్టల్‌లో అప్‌లోడ్ చేస్తే అనుమతి వస్తుంది. రమారమి 20 శాతం తక్కువ ధరకు వాహనాలు అందుతాయి. కొన్ని టూవీలర్ల ధరలు 25 శాతం కూడా తగ్గుతాయి.

- ఒకసారి కారు లేదా టూవీలర్ తీసుకుంటే మళ్లీ ఐదేళ్ల వరకూ తీసుకోకూడదు. ఆరో ఏట తీసుకోవచ్చు. రెండేళ్ల పాటు బండిని అమ్ముకోకూడదు. తనపేరు మీదే ఉంటుంది. మిగతా ఏ ఖరీదైన వస్తువైనా సరే మూడేళ్లకోసారి తీసుకోవచ్చు. మిక్సీలు, గ్రైండర్లు ఇలా రూ.70 వేల లోపు విలువైనవి ప్రతి నెలా కొనుగోలు చేసుకోవచ్చు. ఈ రాయితీలు త్రివిధ దళాలు అంటే నేవీ, ఎయిర్‌ఫోర్స్, ఆర్మీ వారికి మాత్రమే వర్తిస్తాయి. బీఎస్‌ఎఫ్, సీఆర్‌పీఎఫ్ వంటివన్నీ పారా మిలటరీ కిందకు వస్తాయి. వీరికి వేరే క్యాంటీన్లు ఉంటాయి.



అనంతపురంలోని మిలిటరీ క్యాంటీన్

ఏవి ఎన్ని తీసుకోవచ్చు

కేటగిరీ	పరిమితి
నిత్యావసరాలు	రూ.5,000
లిక్కర్	4 బాటిళ్లు కనిష్టంగా
కారు	రూ.12 లక్షలు విలువైన (ర్యాంకునుబట్టి)
టూవీలర్	ఎంత సీసీ ఉన్నదైనా
టీవీ, ఏసీ	రేటు పరిమితి లేదు

సద్వినియోగం చేసుకోవాలి



ఎన్నో ఏళ్లు దేశ సేవ చేసి వచ్చిన మాజీ సైనికోద్యోగులు వారికి వచ్చే రాయితీలు తెలియక ఉపయోగించుకోవడం లేదు. ఖరీదైన వాహనాలు, ఎలక్ట్రానిక్ వస్తువులు తీసుకున్నా రాయితీ వర్తిస్తుంది. వీటిపై వాట్సాప్ గ్రూపులు ఏర్పాటు చేసి అవగాహన కల్పిస్తున్నాం. ప్రతి మాజీ సైనికోద్యోగి రాయితీ ద్వారా కొనుగోలు చేయాలి.

– మారుతి, మేనేజర్, అనంతపురం సీఎస్‌డీ క్యాంటీన్

పాపం పసివాడు

- తల్లి మందలించిందని బస్సెక్కి మైదుకూరుకు చేరుకున్న గుత్తి బాలుడు
- సెల్‌ఫోన్ దొంగిలించాడని స్టేషన్‌కు పట్టుకెళ్లిన ఓ వ్యక్తి
- అధికారులు విచారిస్తే బస్సులోనే పోగొట్టుకున్నట్లు వెల్లడి
- బాలుడిని కాపాడి తల్లి వద్దకు చేర్చిన ఆర్టీసీ ఏడీసీ



మైదుకూరు బస్టాండ్‌లో ఏడీసీ లక్ష్మయ్యతో బాలుడు

మైదుకూరు: తల్లి మందలించిందనే బాధతో ఇంటి నుంచి పారిపోయి వచ్చిన బాలుడు.. మైదుకూరు ఆర్టీసీ బస్టాండ్‌లో సెల్ ఫోన్ దొంగలించాడనే అపవాదును ఎదుర్కొని చివరికి స్థానిక ఆర్టీసీ అధికారి చొరవతో నిర్దోషిగా తేలి తిరిగి తల్లిదండ్రుల వద్దకు చేరిన ఘటన ఇది. గుత్తికి చెందిన దంపతులకు ఇద్దరు ఆడ పిల్లలు, ఒక కొడుకు ఉన్నారు. 12 ఏళ్ల ఈ బాలుడు ఐదో తరగతి చదువుతున్నాడు. సోమవారం భార్యాభర్తలు ఇరువురు ఇంట్లో గొడవ పడ్డారు. ఆ సమయంలో అక్కడే ఉన్న కుమారుడిపై తల్లి గట్టిగా కేకలు వేసింది. తల్లి మందలించడంతో బాధపడిన బాలుడు ఇంటి నుంచి పారిపోయి వచ్చాడు. మంగళవారం ఉదయం మైదుకూరు ఆర్టీసీ బస్టాండ్‌లో కర్నూలు–తిరుపతి సర్వీసు బస్సులో డబ్బుల కోసం ప్రయాణికులను యాచిస్తున్నాడు. అదే సమయంలో మైదుకూరుకు చెందిన ఖాజా అనే వ్యక్తి తిరుపతి వెళ్లేందుకు అదే బస్సు ఎక్కాడు. కొంత సేపటికి తన సెల్ ఫోన్ కనిపించలేదని హడావుడి చేసిన ఖాజా తన సెల్‌ఫోన్‌ను దొంగలించాడని ఆ పిల్లవాణ్ణి పట్టుకున్నాడు. తాను దొంగలించలేదని, తాను దొంగను కాదని బాలుడు ఏడుస్తూ చెప్పాడు. సెల్ ఫోన్‌ను దొంగలించి ఇంకొకరికి ఇచ్చి పంపావు అంటూ ఖాజా బాలుడిని బస్సు నుంచి కిందకు దించి స్థానిక పోలీస్ స్టేషన్‌కు తీసుకెళ్లాడు. అది గమనించిన మైదుకూరు డిపోకు చెందిన జనరల్ ఏడీసీ ఎం.లక్ష్మయ్య స్టేషన్‌కు చేరుకుని బాలుడితో మాట్లాడారు. బాలుడు చెప్పినదంతా విని ఈ అబ్బాయి సెల్‌ఫోన్ దొంగలించి ఉండడని అన్నారు. బాధితునితో సెల్ నంబర్‌ను చెప్పించుకుని ఆ నంబర్‌కు ఫోన్ చేశారు. ఖాజా సెల్ ఫోన్‌ను కర్నూలు–తిరుపతి బస్సులో ఉన్న ఓ వ్యక్తి ఎత్తి మాట్లాడాడు. ఎవరిదో సెల్ ఫోన్ సీట్‌పై పడి ఉండగా తీసి తన వద్ద ఉంచుకున్నట్టు ఆ వ్యక్తి చెప్పాడు. అది మైదుకూరుకు చెందిన ఓ వ్యక్తిదని, దానిని కడప బస్టాండ్‌లోని ఎంక్వైరీ వద్ద డ్యూటీలో ఉన్న వంశీ అనే వ్యక్తికి అందజేయాలని ఏడీసీ లక్ష్మయ్య కోరారు. ఫోన్ బస్సులో జారి పడగా చూసుకోకుండా బాలుడిపై అనవసరంగా నిందలు వేసినందుకు పోలీసులు ఖాజాను మందలించి పంపారు. అనంతరం ఏడీసీ లక్ష్మయ్య బాలుడిని వెంటబెట్టుకుని హోటల్‌కు తీసుకెళ్లి టిఫిన్ తినిపించారు. తర్వాత బాలుడి తల్లి నంబర్ తీసుకొని ఆమెతో సెల్‌ఫోన్‌లో మాట్లాడారు. 'మీ అబ్బాయి మైదుకూరులో మా వద్ద క్షేమంగా ఉన్నాడు' అని చెప్పగా.. ఇంట్లో తాము గొడవ పడి ఆ కోపంతో బాలుడిని మందలించానని ఆమె పశ్చాత్తాపాన్ని వ్యక్తం చేసింది. తన కుమారుడిని తమ వద్దకు పంపాలని అభ్యర్థించింది. ఆ మేరకు బాలుడిని నెల్లూరు–అనంతపురం సర్వీస్ బస్సులో ఎక్కించిన లక్ష్మయ్య టికెట్ తీయించి అదనంగా రూ.360ను అతని జేబులో ఉంచారు. సాయంత్రం తన కుమారుడు ఇంటికి చేరుకోగానే తల్లి సంతోషంతో ఏడీసీ లక్ష్మయ్యకు ఫోన్ చేసి కృతజ్ఞతలు తెలిపారు. పసిప్రాయంలో ఇంటి నుంచి పారిపోయి వచ్చి జీవితంలో మరిచిపోలేని చేదు జ్ఞాపకాన్ని బాలుడు మిగిల్చుకోగా, బాలుడి పరిస్థితిపై జాలిపడి చొరవ చూపి అతన్ని నిర్దోషిగా తేల్చి తిరిగి తల్లిదండ్రుల వద్దకు చేర్చి మానవత్వాన్ని చూపిన ఆర్టీసీ అధికారి లక్ష్మయ్య అందరి మన్ననలను అందుకున్నారు.

సెంట్రల్ యూనివర్సిటీలో 'మిషన్ మాలవ్య' కేంద్రం



అనంతపురం: అనంతపురం శివారులోని జంతలూరు వద్ద ఉన్న ఆంధ్రప్రదేశ్ సెంట్రల్ యూనివర్సిటీ క్యాంపస్‌లో భారత ప్రభుత్వ విద్యామంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో మిషన్ మాలవ్య ఉపాధ్యాయ శిక్షణ కేంద్రం (ఎంఎంటీటీసీ) ఏర్పాటుకు అనుమతి లభించింది. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ఉన్నత విద్యా సంస్థల అధ్యాపకులకు ఆధునిక, నాణ్యమైన శిక్షణ అందించి వృత్తిపరమైన నైపుణ్యాలు పెంపొందించేందుకు ఈ కేంద్రం దోహదపడనుంది. వినూత్న బోధనా పద్ధతులు, బోధనలో సాంకేతికత వినియోగం, పాఠ్యాంశాల రూపకల్పన, పరిశోధన, మూల్యాంకన పద్ధతులు, అంతర శాస్త్రీయ బోధన విధానాలు ఈ కేంద్రం ప్రధాన లక్ష్యాలని వర్సిటీ వైస్ చాన్సలర్ డాక్టర్ ఎస్‌ఏ కోరి, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ షీలా రెడ్డి తెలిపారు. ఈ కేంద్రం ఏర్పాటు వర్సిటీకి, విద్యారంగానికి గర్వకారణమని పేర్కొన్నారు.

జాతీయ మానిటరింగ్ కమిటీ సభ్యుల పర్యటన

గుంతకల్లు రూరల్: కేంద్ర ప్రభుత్వ నిధులతో గ్రామీణ ప్రాంతాల్లో చేపట్టిన అభివృద్ధి పనులు, ప్రజల ఆర్థిక స్థితిగతులు, వారి సమస్యలు తదితర వాటిని పరిశీలించేందుకు మంగళవారం గుంతకల్లు మండలం దోసలుడుకి పంచాయతీలో జాతీయ మానిటరింగ్ కమిటీ సభ్యులు పర్యటించారు. రీసర్చ్ ఆఫీసర్ సాంబశివరావు, అసిస్టెంట్ రీసెర్చ్ ఆఫీసర్ సబ్బాటి నవ్యతో కలసి డ్వామా పీడీ సలీం బాషా,ఏపీడీ అయేషా, సిబ్బంది దోసలుడుకి, సంగాల, గుండాల తండా గ్రామాల్లో ఉపాధి హామీ పథకం కింద చేపట్టిన పనులను పరిశీలించారు. కూలీలు, పింఛన్ లబ్ధిదారులు, ప్రధానమంత్రి ఆవాస్ యోజన లబ్ధిదారులతో సమావేశమై మాట్లాడారు. హౌసింగ్ లబ్ధిదారులతో మాట్లాడి వారి ఇళ్ల నిర్మాణ పనులపై ఆరా తీశారు.

ఏడిపిస్తున్న శవ 'పరీక్ష'

- రాయదుర్గం ఆస్పత్రి మార్చురీలో వసతుల కరువు
- వాహనాల్లోనే గంటల తరబడి మృతదేహాలు
- వర్ణనాతీతంగా బాధితుల వేదన



ఆటోలో నుంచి పోస్టుమార్టం గదికి మృతదేహాలను తీసుకెళ్తున్న బంధువులు

రాయదుర్గం: స్థానిక ప్రభుత్వ ఆస్పత్రి మార్చురీలో వసతులు కరువయ్యాయి. ఉన్నది ఒకటే గది... అది కూడా చిన్నదిగా ఉండడంతో అవస్థలు తప్పడం లేదు. వాహనాల్లోనే గంటల తరబడి మృతదేహాలను ఉంచాల్సిన దయనీయమైన పరిస్థితులు నెలకొన్నాయి. అప్పటికే తమ వాళ్లు పోయిన దుఃఖంలో ఉన్న కుటుంబీకులు, బంధువులు.. ఈ దుస్థితితో మరింతగా కన్నీళ్లు పెడుతున్నారు. సోమవారం రాయదుర్గం ఏరియా ఆస్పత్రికి ఒకేసారి ఐదు మృతదేహాలను తీసుకురాగా మార్చురీలో ఖాళీ లేక వాహనాల్లోనే సుమారు 8 గంటల పాటు ఉంచాల్సి వచ్చింది. మార్చురీ వద్ద కనీసం కూర్చునేందుకు కూడా ఎలాంటి సౌకర్యం లేకపోవడంతో మృతుల కుటుంబీకులు, బంధువులు ఎండలోనే అవస్థలు పడుతూ నిరీక్షించారు.

పేరుకే అప్‌గ్రేడ్ ఆస్పత్రి..

కర్ణాటక సరిహద్దున ఉన్న రాయదుర్గం నియోజకవర్గంలో క్రైమ్ రేట్ ఎక్కువ. రోడ్డు ప్రమాదాలు కూడా అధికంగా జరుగుతుంటాయి. కణేకల్లు మినహా మిగిలిన నాలుగు మండలాల్లో ఎక్కడా శవపరీక్ష నిర్వహించే గది లేకపోవడంతో మృతదేహాలను పోస్టుమార్టం కోసం ఎక్కువగా రాయదుర్గం ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకొస్తుంటారు. ఇక్కడేమో తగిన వసతుల్లేక బాధిత కుటుంబీకుల వేదన వర్ణనాతీతంగా ఉంటోంది. రాయదుర్గం పట్టణానికి 60 కిలోమీటర్ల దూరంలో ఉన్న బొమ్మనహాళ్, డీ హీరేహాళ్ మండలాల నుంచి మృతదేహాలను తీసుకొచ్చినప్పుడు వారు పడే అవస్థలు చెప్పనలవిగా ఉంటున్నాయి. పేరుకే అప్‌గ్రేడ్ ఆస్పత్రి అయినా ఆ మేరకు వసతులు లేకపోవడంపై సామాన్యులు పెదవి విరుస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు, పాలకులు స్పందించి ఆస్పత్రి ప్రాంగణంలో అదనంగా మార్చురీ గదులు నిర్మించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

అధికారుల దృష్టికి తీసుకెళ్తాం

మార్చురీ గది చిన్నదిగా ఉండడంతో శవ పరీక్షల కోసం ఇబ్బందిగా మారింది. సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తాం. అదనపు గది నిర్మాణం కోసం ప్రతిపాదనలు పంపిస్తాం. వైద్యులు, సిబ్బంది నుంచి ఎక్కడా ఆలస్యం లేకుండా పోస్టుమార్టం పూర్తి చేసి పంపుతాం.

– మెర్సీ జ్ఞానసుధ, ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్, రాయదుర్గం

క్లుప్తంగా

అధినేతతో ప్రవాసాంధ్రుల భేటీ



వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని కలసిన ప్రవాసాంధ్రులు, ఆలూరు సాంబశివారెడ్డి

అనంతపురం కార్పొరేషన్: వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని తాడేపల్లిలో క్యాంప్ కార్యాలయంలో మంగళవారం ప్రవాసాంధ్రులు కలిశారు. ఈ సందర్భంగా వారి వెంట పార్టీ ఎన్ఆర్ఐ వింగ్ కో ఆర్డినేటర్ ఆలూరు సాంబశివారెడ్డి ఉన్నారు. వైఎస్ జగన్‌ను కలసిన వారిలో ఆస్ట్రేలియా కన్వీనర్ సూర్యనారాయణరెడ్డి, శ్రీనివాసరెడ్డి (యూకే) ఉన్నారు.

18న జిల్లాస్థాయి యోగా టోర్నీ

గుంతకల్లు టౌన్: ఈ నెల 18న జిల్లా స్థాయి యోగా టోర్నీని గుంతకల్లులోని మాంటిస్సోరి స్కూల్‌లో నిర్వహించనున్నారు. ఈ మేరకు యోగా అసోసియేషన్ జిల్లా కార్యదర్శి మనోహర్‌రెడ్డి మంగళవారం తెలిపారు. 8 నుంచి 21 ఏళ్లలోపు బాల, బాలికలతో పాటు 21 నుంచి 45.. ఆపై వయస్సు ఉన్న మహిళలు, పురుషుల విభాగంలో పోటీలు ఉంటాయి. టోర్నీలో ప్రతిభ కనబరిచిన వారిని ఈ నెల చివరి వారంలో పశ్చిమగోదావరి జిల్లా కేంద్రంగా జరిగే రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక చేయనున్నారు. పోటీల్లో పాల్గొనే ఆసక్తి ఉన్న వారు 93980 14919, 95906 33388లో సంప్రదించవచ్చు.

జాతీయ స్థాయి చదరంగ పోటీలకు ఎంపిక



జునైరా



కార్తికేయన్



మేధాన్ష్

గుంతకల్లు: ఈ ఏడాది సెప్టెంబర్‌లో గోవా వేదికగా జరిగే 38వ జాతీయ స్థాయి చదరంగం పోటీలకు గుంతకల్లుకు చెందిన ముగ్గురు విద్యార్థులు ఎంపికైనట్లు కోచ్ అనిల్‌కుమార్ తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఓ ప్రకటన విడుదల చేశారు. ఆంధ్రప్రదేశ్ చెస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 2, 3 తేదీల్లో మచిలీపట్నంలో జరిగిన రాష్ట్ర స్థాయి పోటీల్లో గుంతకల్లుకు చెందిన సెయింట్ పీటర్ స్కూల్ విద్యార్థి జునైరా, భాష్యం హైస్కూల్‌కు చెందిన విద్యార్థులు కార్తికేయన్, మేధాన్ష్ ప్రతిభ చాటి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైనట్లు వివరించారు.

అక్రమ దందాకు సువర్ణ అవకాశం

- తాడిపత్రి కేంద్రంగా బంగారం దందా
- పట్టించుకోని అధికార యంత్రాంగం
- జీఎస్టీని ఎగవేస్తున్న వ్యాపారులు



పోలీసులు స్వాధీనం చేసుకున్న బంగారం (ఫైల్)

తాడిపత్రి రూరల్: రాయలసీమ జిల్లాల్లో ప్రొద్దుటూరు తర్వాత బంగారం వ్యాపారంలో తాడిపత్రిది ప్రత్యేక స్థానం. ఇక్కడ బంగారం వ్యాపారం రూ.కోట్లలోనే జరుగుతోంది. అయితే ఇందుకు అనుగుణంగా జీఎస్టీ ద్వారా ప్రభుత్వానికి చెల్లించే పన్ను ఆశించిన స్థాయిలో ఉండడం లేదు. ఇక్కడి వ్యాపారుల్లో కొందరు జీఎస్టీని ఎగవేసేందుకు బంగారు కొనుగోలులో అక్రమ మార్గాలను అనుసరిస్తుండడమే ఇందుకు కారణంగా తెలుస్తోంది.

జీరో దందాలో ఆరితేరి..

తాడిపత్రి కేంద్రంగా బంగారం అక్రమ వ్యాపారం జోరుగా సాగుతోందనేది బహిరంగ రహస్యం. నిబంధనల మేరకు రూ.1లక్ష విలువైన బంగారానికి 3 శాతం అంటే రూ.3 వేలు చొప్పున ప్రభుత్వానికి చెల్లించాల్సి ఉంది. ఈ కనీస మొత్తాన్ని సైతం కొందరు వ్యాపారులు ఎగ్గొటి జీరో వ్యాపారంతో రూ.కోట్లు గడిస్తున్నారు. మరి కొందరు వ్యాపారులు ఇతర ప్రాంతాల్లోని వ్యాపారులకు ఆర్డర్లు ఇవ్వడంతో వారు తాడిపత్రికి బంగారం బిస్కెట్లు, నగలను గుట్టు చప్పుడు కాకుండా రవాణా చేస్తున్నారు. ఎక్కువగా తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాలతో పాటు వైఎస్సార్ కడప జిల్లా ప్రొద్దుటూరు నుంచి బంగారం అక్రమ మార్గాల ద్వారా తాడిపత్రికి చేరుతోంది.

ఆ రెండు మార్గాల్లోనే అక్రమ రవాణా

తాడిపత్రికి బంగారాన్ని తరలించే వారు ప్రధానంగా రోడ్డు, రైల్వే మార్గాలను ఎంచుకుంటున్నారు. గతంలో అందిన సమాచారం మేరకు తాడిపత్రికి చెందిన ఓ బంగారం వ్యాపారి గుమస్తాను స్థానిక ఆర్టీసీ బస్టాండ్‌లో బస్సు ఎక్కుతుండగా పోలీసులు అదుపులోకి తీసుకుని, అతని వద్ద ఉన్న బ్యాగ్‌లను తనిఖీ చేశారు. అందులో రూ.లక్షల్లో నగదు బయటపడింది. దీంతో రోడ్డు మార్గం ద్వారా పోలీసుల నిఘా ఉందని తెలుసుకున్న వ్యాపారులు రైలు మార్గాన్ని ఎంచుకున్నారు. ఈ మార్గంలోనూ ఓ వ్యాపారిని రెడ్ హ్యాండెడ్‌గా పోలీసులు పట్టుకున్నారు. గత ఎన్నికల సమయంలో తమిళనాడు నుంచి ఇరువురు వ్యాపారులు బంగారు నగలను తాడిపత్రికి తీసుకువస్తుండగా అప్పటికే కాపు కాచిన దుండగులు మెయిన్ బజార్‌లో వారిపై దాడి చేసి మొత్తం బంగారు నగలను అపహరించుకెళ్లడం రాష్ట్ర వ్యాప్తంగా సంచలనం రేకెత్తించింది. బాధితుల ఫిర్యాదు మేరకు సీసీ ఫుటేజీల ఆధారంగా దుండగులను పోలీసులు బంధించి రూ. లక్షల విలువైన బంగారు నగలను అప్పట్లో స్వాధీనం చేసుకున్నారు. అయితే ఈ నగలకు ఎలాంటి రసీదులు లేకపోవడం గమనార్హం. కొంత కాలం క్రితం తాడిపత్రి రైల్వే స్టేషన్‌లో ఆదోనికి చెందిన వ్యాపారుల నుంచి 13 కిలోల బంగారాన్ని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. వీటికి కూడా ఎలాంటి రసీదులు లేవు. నాలుగు రోజుల క్రితం అనంతపురం నుంచి తాడిపత్రి వైపు వస్తున్న వాహనాన్ని రూరల్ సీఐ శివగంగాధర్‌రెడ్డి తన సిబ్బందితో కలసి ఆపి తనిఖీ చేశారు. తనిఖీల్లో కిలోకు పైగా బంగారాన్ని గుర్తించి స్వాధీనం చేసుకుని, ఎటువంటి బిల్లులు లేకపోవడంతో వాణిజ్య పన్నులశాఖకు అప్పగించారు.

దొరికితే దొంగ

తాడిపత్రిలోని కొందరు వ్యాపారులు చోరీ సొత్తును తక్కువ ధరకే కొనుగోలు చేస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. ఈ బంగారానికి ఎలాంటి జీఎస్టీ చెల్లించే అవకాశం లేకపోవడంతో విక్రయాల సమయంలో ఎక్కువ ఆదాయం ఉంటుందనే దురాశతో కొందరు వ్యాపారులు ఈ అక్రమ దందాకు తెరలేపినట్లు సమాచారం. గతంలో వివిధ పద్ధతుల్లో పోలీసులు, ఇతర అధికారులు స్వాధీనం చేసుకున్న బంగారాన్ని అధికార, రాజకీయ పలుకుబడితో లేని బిల్లులను సృష్టించి విడిపించుకున్న సందర్భాలూ ఉన్నాయి.

నగదు లావాదేవీలపై అప్రమత్తత అవసరం



పోస్టర్లను విడుదల చేస్తున్న ఎస్పీ జగదీష్

అనంతపురం: పెద్ద మొత్తంలో నగదు లావాదేవీలు జరిపే సమయంలో అప్రమత్తంగా పరిశీలించాలని బ్యాంకర్లకు ఎస్పీ పి.జగదీష్ సూచించారు. బ్యాంకులు, ఏటీఎం కేంద్రాల వద్ద భద్రతా ప్రమాణాలు, సైబర్ నేరాలపై ఖాతాదారులను అప్రమత్తం చేయడంలో బ్యాంకర్ల పాత్ర తదితర అంశాలపై మంగళవారం ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో ఎస్పీ మాట్లాడారు. ఆర్‌బీఐ ఆదేశాల మేరకు ప్రతి బ్యాంకు, ఏటీఎంల వద్ద నిర్దేశిత భద్రతా ప్రమాణాలు తప్పనిసరిగా ఉండాలన్నారు. బ్యాంకులు, పరిసరాలు స్పష్టంగా కనిపించేలా సీసీ కెమెరాలు అమర్చాలన్నారు. ఏటీఎంల వద్ద రేయింబవళ్లూ రికార్డు అయ్యేలా అత్యాధునిక హెచ్‌డీ కెమెరాలను అమర్చాలన్నారు. ఈ డేటాను క్లౌడ్ స్టోరేజీలో నిక్షిప్తం చేసుకునేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఫిజికల్ సెక్యూరిటీ పరంగా బ్యాంకులు, ఏటీఎంల వద్ద గల కిటికీలు, గ్రిల్ గేట్లు స్ట్రాంగ్‌గా ఉండేలా చూసుకోవాలని, షట్టర్లకు నాణ్యమైన తాళాలు ఉపయోగించాలని సూచించారు. బ్యాంకు విధుల్లో నియమించుకునే తాత్కాలిక సిబ్బంది, అవుట్‌సోర్సింగ్ భద్రతా సిబ్బందికి ముందుగా పోలీస్ వెరిఫికేషన్ తప్పనిసరి అని అన్నారు. డిజిటల్ అరెస్ట్, లోన్ యాప్స్. ఫిషింగ్ ఈ మెయిల్స్, ఓటీపీ ఫ్రాడ్స్, ఏపీకే ఫైల్స్, ఇన్వెస్ట్‌మెంట్స్ ఫ్రాడ్స్‌పై ఖాతాదారులను అప్రమత్తం చేస్తూ సైబర్ మోసాలపై అవగాహన కల్పించాలన్నారు. అనంతరం ప్రజలు సైబర్ నేరగాళ్ల ఉచ్చులో చిక్కుకోకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై పోలీసు శాఖ రూపొందించిన పోస్టర్లను బ్యాంకు అధికారులతో కలసి ఎస్పీ ఆవిష్కరించారు. కార్యక్రమంలో డీఎస్పీలు మహబూబ్‌బాషా, వి.శ్రీనివాసరావు, జిల్లా స్పెషల్ బ్రాంచ్, సైబర్ సెల్, డీసీఆర్‌బీ, సీసీఎస్ సీఐలు ధరణికిషోర్, క్రాంతికుమార్, షేక్ జాకీర్, హరినాథ్, వలీబాషా, ఎస్‌ఐలు రాజశేఖర్ రెడ్డి, లీడ్ బ్యాంక్ మేనేజర్‌తో పటు 35 బ్యాంకులకు సంబంధించిన మేనేజర్లు, ఫీల్డ్ ఆఫీసర్లు, నోడల్ అధికారులు పాల్గొన్నారు.

ఆర్టీసీ స్థలాలు కాపాడుకుందాం : ఈయూ



మాట్లాడుతున్న ఎంప్లాయిస్ యూనియన్ నేతలు

అనంతపురం క్రైం: వేల కోట్ల రూపాయల విలువైన ఆర్టీసీ స్థలాలను లూలూకు అప్పనంగా కట్టబెట్టాలని చూస్తే సహించబోమని, రాష్ట్ర ప్రభుత్వ కుట్రను తిప్పికొట్టి ఆర్టీసీలను కాపాడుకుందామని ఎంప్లాయిస్ యూనియన్ (ఈయూ) నేతలు పిలుపునిచ్చారు. మంగళవారం అనంతపురంలోని కృష్ణ కళామందిరంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఈయూ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు ఆర్‌వీరెడ్డి, పీఎస్ ఖాన్ మాట్లాడారు. ప్రజా ప్రయోజనాలకు ఉపయోగించాల్సిన భూములను లూలూ లాంటి కంపెనీలకు కట్టబెట్టాలనుకోవడం సిగ్గు చేటన్నారు. ఇప్పటికే లూలూ నష్టాల్లో ఉందని, అలాంటి కంపెనీకి ఆర్టీసీ స్థలాన్ని 99 ఏళ్ల పాటు లీజుకివ్వడానికి జీఓ 137ని తీసుకురావడం సబబు కాదని అన్నారు. ఏపీలో రూ.160 కోట్లు పెట్టుబడి పెడుతున్న లూలూకి రూ.400 కోట్ల విలువైన విజయవాడలోని 4.15 ఎకరాల స్థలాన్ని అప్పగించడం అనుమానాలకు తావిస్తోందన్నారు. 2014లో టీడీపీ అధికారంలో ఉండగా విజయవాడ ఆర్టీసీ ట్రెనింగ్ కళాశాల స్థలం 29 ఎకరాలను హెచ్‌ఈఎల్ కంపెనీకి అప్పగించారన్నారు. ఆ స్థలానికి బదులుగా ప్రత్యామ్నాయ స్థలాన్ని కేటాయిస్తామని నేటికీ గజం కూడా ఇవ్వలేదన్నారు. ఆర్టీసీ ఉద్యోగులకు ఇచ్చిన హామీల్లో ఒక్కటి కూడా నెరవేర్చక పోగా ఏకంగా సంస్థ ఆస్తులను కరగదీయాలని చూడటం అన్యాయమన్నారు. జీఓను రద్దు చేయకపోతే ఆర్టీసీ ఆస్తుల పరిరక్షణకు పోరాటాలకు సిద్ధమవుతామన్నారు. కార్యక్రమంలో ఈయూ నాయకులు ఎస్.రామకృష్ణ, సీవీపీ ఓబుళరత్నం, కళ్లప్ప, రఫీ తదితరులు పాల్గొన్నారు.

జిల్లాకు 2,847 మెట్రిక్ టన్నుల ఎరువులు



జిల్లాకు చేరిన ఎరువులను పరిశీలిస్తున్న ఏడీఏ అల్తాఫ్ అలీఖాన్

అనంతపురం అగ్రికల్చర్: వివిధ కంపెనీల నుంచి జిల్లాకు 2,847 మెట్రిక్ టన్నుల ఎరువులు సరఫరా అయినట్లు రేక్ ఆఫీసర్, ఏడీఏ అల్తాఫ్ అలీఖాన్ తెలిపారు. రైల్వే వ్యాగన్ల ద్వారా స్థానిక ప్రసన్నాయపల్లి రైల్వేస్టేషన్ రేక్ పాయింట్‌కు వచ్చిన ఎరువులను ఆయన పరిశీలించారు. కోరమాండల్, పీపీఎల్, మహాధన్ కంపెనీల నుంచి 20-20-0-13, 28-28-0, 10-26-26 కాంప్లెక్స్‌లతో పాటు డీఏపీ ఎరువులు వచ్చాయన్నారు. జాయింట్ కలెక్టర్ ఆదేశాల మేరకు మార్క్‌ఫెడ్, మన గ్రోమోర్ సెంటర్లు, అలాగే ప్రైవేట్ డీలర్లకు సరఫరా చేయడంతో పాటు మిగిలినవి కంపెనీ గోదాముల్లో నిల్వ చేయనున్నట్లు తెలిపారు. అలాగే ఒకట్రెండు రోజుల్లో యూరియా వ్యాగన్లు రానున్నట్లు పేర్కొన్నారు.

వెల్ఫేర్ అసిస్టెంట్ ఆత్మహత్యాయత్నం



బాధితుడిని ఆస్పత్రికి తరలిస్తున్న పోలీసులు

రాయదుర్గం టౌన్: కుటుంబ కలహాలతో విసుగు చెంది ఓ సచివాలయ ఉద్యోగి ఆత్మహత్యాయత్నం చేశాడు. పోలీసులు తెలిపిన మేరకు... రాయదుర్గం మండలం మల్కాపురం గ్రామానికి చెందిన తిప్పన్న కుమారుడు మల్లికార్జున ఇదే మండలం పల్లేపల్లి గ్రామ సచివాలయంలో వెల్ఫేర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్నాడు. భార్య మంజులమ్మ, ఐదు నెలల వయసున్న కుమార్తె ఉంది. తాను ఆత్మహత్య చేసుకోబోతున్నట్లు మంగళవారం మధ్యాహ్నం తన అన్నకుమారుడు తిప్పేరుద్రకు వాట్సాప్ ద్వారా సమాచారం అందజేశాడు. అప్రమత్తమైన తిప్పేరుద్ర ఎన్ని సార్లు ఫోన్ చేసినా స్పందించలేదు. దీంతో బంధువులతో కలసి విషయాన్ని వెంటనే రాయదుర్గం సీఐ జయనాయక్ దృష్టికి తీసుకెళ్లాడు. స్పందించిన సీఐ సాంకేతికతను వినియోగించి రాయదుర్గం సమీపంలోని బీటీపీ రోడ్డు రైల్వే ట్రాక్ వద్ద ఓ పొలంలో ఉన్నట్లుగా గుర్తించడంతో సిబ్బంది అక్కడకు చేరుకున్నారు. అప్పటికే సగం డబ్బా పురుగుల మందును సేవించి ఇబ్బంది పడుతున్న మల్లికార్జునను గుర్తించి ఆగమేఘాలపై స్థానిక ఏరియా ఆస్పత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం బళ్లారిలోని విమ్స్‌కు కుటుంబసభ్యులు తీసుకెళ్లారు. కాగా, కుటుంబ కలహాల నేపథ్యంలోనే మల్లికార్జున ఆత్మహత్యాయత్నానికి పాల్పడినట్లు కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

కూటమి పాలనలో వ్యవసాయం కుదేలు

- ఎమ్మెల్సీ శివరామిరెడ్డి ధ్వజం



ఉరవకొండ: కూటమి పాలనలో రాష్ట్రంలో వ్యవసాయం కుదేలయిందని, టీడీపీ నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం రైతులను అన్ని రకాలుగా మోసగిస్తోందని ఎమ్మెల్సీ వై.శివరామిరెడ్డి ధ్వజమెత్తారు. ఈ మేరకు మంగళవారం ఓ ప్రకటన విడుదల చేశారు. రైతులకు పెట్టుబడి సాయం కింద ఏడాదికి రూ.20వేలు ఇస్తామని ఎన్నికల సమయంలో ప్రకటించిన చంద్రబాబు కూటమి.. అధికారం చేపట్టిన తర్వాత తొలి ఏడాది పెట్టుబడి సాయం అందించకుండా రైతులను దగా చేసిందన్నారు. బకాయితో కలిపి రెండో ఏడాది రూ.40 వేలకు గాను కేవలం రూ.5వేలు మాత్రమే ఇచ్చి చేతులు దులుపుకున్నారన్నారు. ప్రభుత్వ సాయం లేకపోవడంతో రైతులు ప్రైవేట్ వడ్డీ వ్యాపారులను ఆశ్రయిస్తున్నారన్నారు. దీనికి తోడు గిట్టుబాటు ధర లేక అయినకాటికి పంటను అమ్ముకోవాల్సిన దుస్థితికి రైతులను నెట్టేశారన్నారు. వైఎస్సార్‌సీపీ హయాంలో రైతుల సంక్షేమం కోసం ధరల స్థిరీకరణ నిధిని అప్పటి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఏర్పాటు చేసి ఆదుకున్నారన్నారు. ఈ నిధిని కూటమి ప్రభుత్వం ఎత్తేసి రైతులను కష్టాల పాలు చేసిందన్నారు. గత ఏడాది బీమా సొమ్ము చెల్లించకపోవడంతో రైతులకు పరిహారం అందని పరిస్థితి ఏర్పడిందన్నారు. రైతులకు సున్నావడ్డీ పథకాన్ని కూడా ఎత్తేశారన్నారు. ఎరువులు అందుబాటులో ఉంచడంలోనూ ప్రభుత్వం ఘోరంగా విఫలమైందన్నారు. పొటాష్ కలిపిన కాంప్లెక్స్ ఎరువుల ధరలు అమాంతం పెరిగిపోయాయన్నారు. రైతాంగ సమస్యలను వదిలి రాజకీయ కక్ష సాధింపులపైనే చంద్రబాబు అండ్ కో శ్రద్ధ పెట్టారని ఆగ్రహం వ్యక్తంచేశారు. ఇప్పటికైనా రైతు సమస్యలపై దృష్టి సారించి ఆదుకోవాలని హితవు పలికారు.

సుస్థిర వ్యవసాయాన్ని ప్రోత్సహించండి

- అధికారులకు ఇన్‌చార్జ్ కలెక్టర్ ఆదేశం



మాట్లాడుతున్న ఇన్‌చార్జ్ కలెక్టర్ శివ్‌నారాయణ్ శర్మ

అనంతపురం అర్బన్: జిల్లాలో సుస్థిర వ్యవసాయాన్ని ప్రోత్సహించాలని, అగ్రిస్టాక్, ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్ ఉపయోగాలపై రైతులను చైతన్య పరచాలని సంబంధిత అధికారులను ఇన్‌చార్జ్ కలెక్టర్ శివ్ నారాయణ్ శర్మ ఆదేశించారు. అగ్రిస్టాక్, ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్ అంశంపై మంగళవారం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో వ్యవసాయ, అనుబంధ శాఖల జిల్లా, డివిజన్ స్థాయి అధికారులకు ఏర్పాటు చేసిన శిక్షణ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. అగ్రిస్టాక్ యాప్‌లో రిజిస్ట్రేషన్ చేసుకున్న ప్రతి రైతుకూ భవిష్యత్తులో వ్యవసాయ, అనుబంధ శాఖల ద్వారా అమలవుతున్న అన్ని పథకాలను అనుసంధానం చేసేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్నారు. కాబట్టి ప్రతి రైతు అగ్రిస్టాక్ యాప్‌లో తప్పనిసరిగా రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయాధికారి ఉమామహేశ్వరమ్మ, ఇతర అధికారులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి పోరాటం : ఎస్‌ఎఫ్‌ఐ

శింగనమల: విద్యార్థుల సమస్యల పరిష్కారానికి అలుపెరగని పోరాటాలు సాగిస్తామని ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా అధ్యక్షుడు తరిమెల గిరి అన్నారు. శింగనమలలోని దుర్గాంజనేయ స్వామి కమ్యూనిటీ హాల్‌లో మంగళవారం ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా ప్లీనరీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా జిల్లా నూతన కమిటీని ఎంపిక చేశారు. అధ్యక్షుడిగా తరిమెల గిరి, ప్రధాన కార్యదర్శిగా ఓతూరు పరమేష్, ఉపాధ్యక్షులుగా వైటీసీ రమేష్, బంగి శివ, వంశీ, సహాయ కార్యదర్శులుగా రాచేపల్లి సూర్యప్రకాష్, వెంకీ, భీమేష్, వంశీ, శివ, నవీన్, అరుణ్, రషీద్‌తో పాటు మరో 12 మందిని జిల్లా కమిటీ సభ్యులుగా ఎంపిక చేశారు. ఈకార్యక్రమంలో ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు సాయి, వీరాంజి, విజయ్, నవీన్, ప్రవీణ్, వినీల్ తదితరులు పాల్గొన్నారు. తరిమెల గిరి మాట్లాడుతూ.. ఫీజు రీయింబర్స్ మెంట్ సాధనకు పోరాటం సాగిద్దామని పిలుపునిచ్చారు.

ట్యాంకర్ ఢీ - యువకుడి మృతి



మృతుడు అర్జున్

గుత్తి రూరల్: మండలంలోని బాచుపల్లి శివారున 44వ జాతీయ రహదారిపై చోటు చేసుకున్న ప్రమాదంలో ఓ యువకుడు మృతిచెందాడు. పోలీసులు తెలిపిన మేరకు... కర్ణాటకలోని గౌరీబిదనూరు తాలూకా ఎర్రగుంట గ్రామానికి చెందిన వెంకటేశప్ప కుమారుడు అర్జున్ (24), తమిళనాడులోని కృష్ణగిరికి చెందిన వెంకటేష్ కుమారుడు ముఖేష్.. అనంతపురంలోని ఓ ప్రైవేటు ఫైనాన్స్ కంపెనీలో కలెక్షన్ ఏజెంట్లుగా పని చేస్తున్నారు. ఈ క్రమంలో నంద్యాల జిల్లా ప్యాపిలిలో రుణాల కంతుల వసూలు కోసం మంగళవారం ద్విచక్ర వాహనంపై బయలుదేరారు. బాచుపల్లి శివారులో చేరుకోగానే కర్నూలు వైపుగా వెళుతున్న ఆయిల్ ట్యాంకర్ ఢీకొంది. తీవ్రంగా గాయపడిన ఇద్దరినీ హైవే అంబులెన్స్ ద్వారా గుత్తిలోని ప్రభుత్వాస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ కోలుకోలేక అర్జున్ మృతి చెందాడు. ముఖేష్‌ను అనంతపురంలోని ఆస్పత్రికి తరలించారు. ప్రమాదానికి కారణమైన ట్యాంకర్‌ను అదుపులోకి తీసుకొని పోలీసులు కేసు నమోదు చేశారు.

వేలాంకణికి ప్రత్యేక రైళ్లు

గుంతకల్లు: తమిళనాడులోని నాగపట్నంలో వెలసిన వెలాంకణి ఆరోగ్య మాత ఉత్సవాలను పురస్కరించుకుని గుంతకల్లు మీదుగా ప్రత్యేక రైలును నడపనున్నట్లు రైల్వే అధికారులు ఓ ప్రకటనలో తెలిపారు. బాంద్రా టెర్మినల్ - వెలాంకణి ప్రత్యేక రైలు (09093) ఈ నెల 27, సెప్టెంబరు ఆరో తేదీల్లో రాత్రి 9-40 గంటలకు బాంద్రా టెర్మినల్ బయలుదేరి రెండో రోజు ఉదయం 7-40 గంటలకు వెలాంకణికి చేరుకుంటుందన్నారు. తిరుగు ప్రయాణంలో రైలు (09094) వెలాంకణిలో ఈ నెల 30, సెప్టెంబరు 9 తేదీల్లో అర్ధరాత్రి 12-30 గంటలకు బయలుదేరి మరుసటి రోజు ఉదయం పదిన్నరకు బాంద్రా టెర్మినల్‌కు చేరుకుంటుందన్నారు. రాయలసీమ జిల్లాలోని మంత్రాలయం, ఆదోని, గుంతకల్లు, గుత్తి, తాడిపత్రి, యర్రగుంట్ల, కడప, రాజంపేట, రేణుగుంటల మీదుగా ప్రయాణిస్తుందన్నారు.

14, 15 తేదీల్లో బీదర్ స్పెషల్ రైళ్లు

ప్రయాణికుల రద్దీ దృష్ట్యా ఈ నెల 14, 15వ తేదీల్లో బెంగళూరు-బీదర్-బెంగుళూరు మధ్య ప్రత్యేక రైళ్లు నడపనున్నారు. 14వ తేదీ బెంగళూరు జంక్షన్ (06519) నుంచి రాత్రి 9.15 గంటలకు బయలుదేరి మరుసటి రోజు ఉదయం 11.30 గంటలకు బీదర్ జంక్షన్‌కు చేరుతుంది. అదే రోజు మధ్యాహ్నం 2.30 గంటలకు బీదర్ నుంచి బయలుదేరిన రైలు (06520) మరుసటి రోజు ఉదయం 4.30 గంటలకు బెంగళూరుకు చేరుతుంది. ఈ రైలు యలహంక, హిందూపురం, ధర్మవరం, అనంతపురం, గుంతకల్లు, ఆదోని, మంత్రాలయం, రాయచూర్, కృష్ణ, యద్గారి, షాహబాద్, కలబురిగి మీదుగా రాకపోకలు సాగిస్తుంది.

కోయంబత్తూర్-జైపూర్ మధ్య ప్రత్యేక రైళ్లు

కోయంబత్తూర్-జైపూర్-కోయంబత్తూర్ మధ్య ఈ నెల 7 నుంచి సెప్టెంబర్ 7వ తేదీ వరకూ ప్రతి గురు, ఆదివారాల్లో దాదాపు 10 సర్వీసులను నడపనున్నారు. కోయంబత్తూర్ జంక్షన్ నుంచి ఈనెల 7న రాత్రి 2.30 గంటలకు బయలుదేరిన రైలు (06181) మరుసటి రోజు మధ్యాహ్నం 1.35 గంటలకు జైపూర్ జంక్షన్‌కు చేరుతుంది. తిరిగి ఈ నెల 10న రాత్రి 10.05 గంటలకు జైపూర్ జంక్షన్ బయలుదేరిన రైలు (06182) మూడో రోజు ఉదయం 8.30 గంటలకు కోయంబత్తూర్ జంక్షన్‌కు చేరుతుంది. తిరుపూర్, ఈరోడ్, సేలం, జోలర్‌పెట్టి, కాట్పాడి, రేణిగుంట, కడప, యర్రగుంట్ల, గుత్తి, డోన్, కర్నూలు, గద్వాల్, మహబూబ్‌నగర్, కాచిగూడ, కామారెడ్డి, నిజామబాద్ మీదుగా రాకపోకలు సాగిస్తుంది.

వ్యక్తి ఆత్మహత్య

కళ్యాణదుర్గం రూరల్: మండలంలోని కుర్లపల్లి నివాసి నాగేంద్ర(46) ఆత్మహత్య చేసుకున్నాడు. ఆలస్యంగా వెలుగు చూసిన ఘటనకు సంబంధించి పోలీసులు తెలిపిన మేరకు.. నాగేంద్రకు భార్య వరలక్ష్మి, ఓ కుమారుడు, కుమార్తె ఉన్నారు. వ్యవసాయ పనులతో జీవనం సాగించేవారు. ఈ క్రమంలో మద్యానికి బానిసై జులాయిగా మారాడు. తాగుడుకు డబ్బు కావాలంటూ తరచూ ఇంట్లో గొడవ పడేవాడు. ఈ క్రమంలో సోమవారం రాత్రి కుటుంబసభ్యులతో గొడవపడి ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. సమాచారం అందుకున్న పోలీసులు మంగళవారం ఘటనపై ఆరా తీసి కేసు నమోదు చేశారు.

కణేకల్లులో విద్యార్థి..



మృతుడు అరవింద్

కణేకల్లు: క్షణికావేశంలో ఓ విద్యార్థి ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన మేరకు.. కణేకల్లు మండలం నల్లంపల్లి కి చెందిన బసప్ప, రేణుక దంపతులకు ముగ్గురు కుమార్తెలు, ఓ కుమారుడు ఉన్నారు. బసప్ప 13 ఏళ్ల క్రితం చనిపోయాడు. అప్పటి నుంచి పిల్లల పోషణ తల్లిపై పడింది. కుమారుడు అరవింద్ (15)ను ప్రయోజకుడిని చేయాలని భావించిన తల్లి.. బుద్ధిగా చదువుకోవాలని తరచూ చెప్పేది. ప్రస్తుతం అరవింద్ పూలచెర్ల గ్రామంలోని జెడ్పీహెచ్ఎస్‌లో పదో తరగతి చదువుతున్నాడు. అయితే తల్లి కష్టాన్ని చూడలేని అరవింద్ తరచూ పాఠశాలకు డుమ్మా కొట్టి తల్లితో పాటు వ్యవసాయ పనులకు వెళ్లేవాడు. పదో తరగతి కీలకమని, నిర్లక్ష్యం చేయకుండా చదువుకోవాలని తల్లి గట్టిగా చెప్పి మంగళవారం పొలానికి వెళ్లింది. ఆ సమయంలో ఇంట్లో ఎవరూ లేని సమయంలో అరవింద్ ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. పొలం పనుల చూసుకుని ఇంటికొచ్చిన తల్లి.. విగత జీవిగా కన్పించిన కొడుకును చూసి కన్నీరు మున్నీరుగా విలపించింది. ఘటనపై పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

విద్యుత్ అదనపు లోడును పెంచుకునేందుకు రాయితీ

అనంతపురం టౌన్: విద్యుత్ సర్వీసుపై అదనపు లోడ్‌ను పెంచుకునేందుకు డెవలప్‌మెంట్ ఛార్జీల కింద వినియోగదారులకు 50 శాతం మేర రాయితీ ఇవ్వనున్నారు. ఈ మేరకు విద్యుత్ శాఖ ఎస్‌ఈ శేషాద్రిశేఖర్ మంగళవారం ఓ ప్రకటన విడుదల చేశారు. 1 కిలోవాట్ నుంచి 10 కిలో వాట్ వరకు ప్రస్తుతం అయ్యే ఛార్జీలలో 50 శాతం మాత్రమే చెల్లించి అదనపు లోడ్‌ను పెంచుకోవచ్చు.

డ్రిప్, స్ప్రింక్లర్ల పంపిణీ వేగవంతం చేయాలి

అనంతపురం అగ్రికల్చర్: డ్రిప్, స్ప్రింక్లర్ పరికరాల పంపిణీ వేగవంతం చేయాలని సంబంధిత అధికారులను ఏపీఎంఐపీ పీడీ బి.రఘునాథరెడ్డి ఆదేశించారు. మంగళవారం స్థానిక ఏపీఎంఐపీ కార్యాలయంలో ఏపీడీ ధనుంజయతో కలిసి ఎంఐ ఇంజనీర్లు, కంపెనీ డీసీఓలతో ఆయన సమావేశమై మాట్లాడారు. ఈ ఏడాది 18 వేల హెక్టార్లు లక్ష్యం కాగా ప్రస్తుతానికి 2,520 హెక్టార్లకు పరికరాలు మంజూరు ఉత్తర్వులు ఇచ్చామన్నారు. ఈ వారంలో మరో 1,500 హెక్టార్లకు ఇవ్వడానికి సిద్ధం చేశామన్నారు. బీటక్యూ, బీఎంసీ, రైతు వాటా త్వరితగతిన చెల్లించే ప్రక్రియ చేస్తే మంజూరు ఉత్తర్వులు వెనువెంటనే వచ్చేలా చర్యలు తీసుకుంటామన్నారు. గతేడాది మంజూరు చేసిన రైతులకు అందజేసిన మెటీరియల్‌ను పొలాల్లో అమర్చాలని ఆదేశించారు.

ఎన్నికల హామీలు మరిచారా బాబూ?

- స్మార్ట్ మీటర్లు వద్దే వద్దు
- విద్యుత్ చార్జీలను వెంటనే తగ్గించాలి
- విద్యుత్ కార్యాలయం ఎదుట ధర్నాలో వామపక్ష నాయకులు



ధర్నా చేస్తున్న వామపక్ష నాయకులు

అనంతపురం టౌన్: ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను సీఎం చంద్రబాబు మర్చిపోయారని, విద్యుత్ ఛార్జీలను పెంచబోమంటూనే భారీగా పెంచేసి సామాన్యులపై పెను భారం మోపుతున్నారని వామపక్ష నాయకులు ధ్వజమెత్తారు. విద్యుత్ ఛార్జీల పెంపునూ నిరసిస్తూ మంగళవారం అనంతపురంలోని విద్యుత్ శాఖ కార్యాలయం ఎదుట వామపక్షాల నాయకులు ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో స్మార్ట్ మీటర్ల ఏర్పాటును వ్యతిరేకించిన బాబు.. నేడు అవే స్మార్ట్ మీటర్లను ప్రతి ఇంటికీ ఏర్పాటు చేసే ప్రయత్నం ముమ్మరం చేశారని మండిపడ్డారు. స్మార్ట్ మీటర్ల వల్ల ప్రతి నెలా వినియోగదారులపై మరింత భారం పడుతోందన్నారు. ఇప్పటికే రూ.వందల్లో వస్తున్న విద్యుత్ బిల్లులు నేడు రూ.వేలకు చేరుకున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఇది ఇలాగే కొనసాగితే రానున్న రోజుల్లో మరింత భయానకంగా ఉంటాయన్నారు. వెంటనే ప్రజావ్యతిరేక కార్యక్రమాలను నిలిపివేయకపోతే పరిణామాలు అదే స్థాయిలో ఉంటాయని హెచ్చరించారు. అనంతరం వివిధ డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని విద్యుత్ శాఖ అధికారులకు అందజేశారు. కార్యక్రమంలో వామపక్ష పార్టీల నాయకులు ఓ.నల్లప్ప, శ్రీరాములు, రామిరెడ్డి, నారాయణస్వామి, నాగరాజునాయక్, రాఘవేంద్ర, చంద్రశేఖర్, రాజారెడ్డి, కేశవరెడ్డి, రమణయ్య, పద్మావతి, సంతోష్‌కుమార్, లింగమయ్య, నాగేంద్ర, రాజేష్ తోపాటు పలువురు పాల్గొన్నారు.

గుర్తు తెలియని యువకుడి దుర్మరణం

తాడిపత్రి టౌన్: వాహనం ఢీకొన్న ఘటనలో ఓ గుర్తు తెలియని యువకుడు దుర్మరణం పాలయ్యాడు. పోలీసులు తెలిపిన మేరకు.. సోమవారం అర్ధరాత్రి దాటిన తర్వాత తాడిపత్రి మండలం రావి వెంకటాంపల్లి సమీపంలో ప్రధాన రహదారిపై నడుచుకుంటూ వెళుతున్న యువకుడి (34)ని వాహనం ఢీకొంది. ఘటనలో తలకు తీవ్ర గాయం కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. ప్రమాదానికి కారణమైన డ్రైవర్ వాహనాన్ని ఆపకుండా వెళ్లిపోయాడు. విషయం తెలుసుకున్న పోలీసులు అక్కడకు చేరుకుని మృతదేహాన్ని తాడిపత్రి ఆస్పత్రిలోని మార్చురీకి తరలించారు. కాగా, మృతుడు వలస కూలీ అయి ఉంటాడనే అనుమానాలు వ్యక్తమయ్యాయి. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

క్లుప్తంగా

ప్రభాకర్‌కు డాక్టరేట్



అనంతపురం: శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయంలోని చరిత్ర విభాగంలో పరిశోధన చేసిన బి. ప్రభాకర్‌కు డాక్టరేట్ ప్రదానం చేశారు. ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాల అధ్యాపకుడు డాక్టర్ డి. సహదేవుడు పర్యవేక్షణలో ' ఏ హిస్టారికల్ అండ్ కల్చరల్ స్టడీ ఆన్ ఆర్కిటెక్చర్ ఆఫ్ విజయనగర పీరియడ్ టెంపుల్స్ ఇన్ శ్రీ సత్యసాయి డిస్ట్రిక్ట్' అనే అంశంపై పరిశోధన చేశారు. ఈ అంశంపై పలు జాతీయ, అంతర్జాతీయ జర్నల్స్ ప్రచురించారు. శ్రీ సత్యసాయి జిల్లాలో విజయనగర రాజుల కాలం నాటి ప్రముఖ దేవాలయాల వాస్తు శైలి, వాటి విశిష్టతపై పరిశోధన చేశారు. ఈ సందర్భంగా ప్రభాకర్‌ను పలువురు అభినందించారు.

ఆరోగ్యంపై అవగాహన కల్పించండి



మాట్లాడుతున్న డాక్టర్ సబిహా సుల్తానా

ఆత్మకూరు: గ్రామాల్లో పర్యటించి ప్రజలకు ఆరోగ్య విషయాలపై అవగాహన కల్పించాలని మండల వైద్యాధికారి సబిహా సుల్తానా వైద్య సిబ్బందికి సూచించారు. మంగళవారం స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో ఆశా డే కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామాల్లో ప్రజలకు ఎలాంటి అనారోగ్య సమస్యలు ఉన్నా వెంటనే ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లి చికిత్స చేయించాలన్నారు. తల్లిపాలపై గర్భిణులు, బాలింతలకు అవగాహన కల్పించాలని సూచించారు. కార్యక్రమంలో ఏఎన్‌ఎమ్‌లు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

జిల్లా పర్యాటక కేంద్రాల అభివృద్ధికి టెండర్లు

అనంతపురం కల్చరల్: వినియోగంలో లేని జిల్లాలోని పలు పర్యాటక కేంద్రాల అభివృద్ధి కోసం లీజు పద్ధతిలో టెండర్లను ఆహ్వానిస్తున్నట్లు జిల్లా పర్యాటక శాఖాధికారి జయకుమార్ మంగళవారం తెలిపారు. రాప్తాడు మండలం మరూరు గ్రామంలో రెస్టారెంట్ భవనం, తాడిపత్రిలో హోటల్ భవనం, గార్లదిన్నెలోని ఎంపీఆర్ డ్యాం వద్ద రెస్టారెంట్, విశ్రాంతి గృహాల భవనాలు, గుత్తి మండలంలోని గుత్తికోట వద్ద స్నాక్‌బార్, టాయిలెటు భవనాలను సంబంధించి టెండర్లు ఉంటాయన్నారు. వివరాలకు జిల్లా పర్యాటక శాఖ కార్యాలయంలో సంప్రదించాలని, ఈనెల 14న ఓపెన్ ఆక్షన్ ఉంటుందన్నారు.

మాతాశిశు మరణాలు జరిగితే చర్యలు తప్పవు



మాట్లాడుతున్న వైద్యాధికారి శివ కృష్ణ

రాప్తాడు: గ్రామాల్లో మాతా శిశు మరణాలు సంభవిస్తే చర్యలు తప్పవని వైద్యాధికారి శివ కృష్ణ వైద్య సిబ్బందిని హెచ్చరించారు. మంగళవారం స్థానిక పీహెచ్‌సీలో వైద్య సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో పర్యటించి ప్రజలకు ఆరోగ్య సలహాలు, సూచనలు అందించాలన్నారు. ముఖ్యంగా గర్భిణులకు బీపీ, రక్తహీనత పరీక్షలు నిర్వహించాలన్నారు. గర్భిణుల ప్రసవానికి ఉచిత రవాణా సౌకర్యాలు ప్రభుత్వం కల్పించిందని తెలిపారు. ప్రజలు 104, 108 సేవలను వినియోగించుకొనేలా అవగాహన కల్పించాలని సూచించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్లు అరుణ, నరసింహ, ల్యాబ్ టెక్నిషియన్ శ్రీధర్ బాబు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

పంటల బీమా సద్వినియోగం చేసుకోండి



మాట్లాడుతున్న ఏడీఏ అల్తాఫ్ అలీఖాన్

అనంతపురం అగ్రికల్చర్: ప్రీమియం గడువు పొడిగించినందున పంటల బీమా పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని వ్యవసాయశాఖ ఏడీ జీఎం అల్తాఫ్ అలీఖాన్ రైతులకు సూచించారు. మంగళవారం రూరల్ మండలం ఆలమూరులో వ్యవసాయ సాంకేతిక యాజమాన్య సంస్థ(ఆత్మ) ఆధ్వర్యంలో రైతులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏడీఏ మాట్లాడుతూ గడువులోపు ప్రీమియం చెల్లించాలన్నారు. జాతీయ ఆహార భద్రతా మిషన్ (ఎన్‌ఎఫ్‌ఎస్‌ఎం), డ్రోన్ టెక్నాలజీ, వర్షాలు, పంటల సాగు, వాటి స్థితిగతులు, చీడపీడల యాజమాన్యం, ఎరువుల పరిస్థితి తదితర అంశాలను తెలియజేశారు. ప్రతి రైతు తప్పనిసరిగా ఈ–క్రాప్ నమోదు చేయించుకోవాలన్నారు. త్వరలోనే ప్రత్యామ్నాయ ప్రణాళిక అమలు చేస్తామని తెలిపారు. ఏఓ వెంకటకుమార్, ఆత్మ అధికారి అనురాధ, ఆర్‌ఎస్‌కే అసిస్టెంట్లు, రైతులు పాల్గొన్నారు.

కుమ్మేసిన వాన..

అనంతపురం కార్పొరేషన్: నగరంలో మంగళవారం సాయంత్రం నుంచి కుండపోత వర్షం కురిసింది. దీంతో ప్రధాన రోడ్లు సప్తగిరి సర్కిల్, రాజు రోడ్డు, శ్రీకంఠం సర్కిల్, టవర్ క్లాక్, రాంనగర్, సూర్యనగర్ సర్కిల్ రోడ్లతో పాటు రజక్‌నగర్, రంగస్వామి నగర్, గౌరవ్ గార్డెన్, యువజనకాలనీ, హనుమాన్ కాలనీ, 5వ రోడ్డు, జన్మభూమి రోడ్డు, ఎర్రనేలకొట్టాలు, మంగళవారి కాలనీ, ఖాజా నగర్, అశోక్‌నగర్, సాయినగర్, ఆదర్శనగర్, నాయక్‌నగర్ తదితర ప్రాంతాలు జలమయమయ్యాయి. వాహనాల రాకపోకలు ఎక్కడికక్కడే నిలిచిపోయాయి. కళ్యాణదుర్గం బైపాస్ రోడ్డులో ట్రాఫిక్ జామ్ అయ్యింది. ఎడతెరపి లేకుండా వర్షం కురవడంతో కరెంటు సరఫరాలో తీవ్ర అంతరాయం ఏర్పడింది. రాత్రి 8.30 గంటల నుంచి కరెంటు సరఫరా ఆగిపోవడంతో నగరంలోని విద్యుత్‌నగర్, అరవిందనగర్, సెవెన్ హిల్స్ కాలనీ, ఆదర్శనగర్, హౌసింగ్ బోర్డు, అశోక్‌నగర్, తదితర ప్రాంతాల్లో చీకట్లు కమ్ముకున్నాయి. దీంతో ఆయా ప్రాంతాల వాసులు ప్రత్యక్ష నరకం చూశారు.



బతుకుబండి నడవాల్సిందే.. వర్షంలో రాకపోకలు సాగిస్తున్న నగర ప్రజలు



కమ్ముకున్న మేఘాలు..
ఇస్కాన్ మందిరం వద్ద ఆవరించిన దట్టమైన మేఘాలు



భద్రం బ్రో..వర్షపు నీటిలో బస్టాండులోకి వెళ్లేందుకు అవస్థలు పడుతున్న ప్రయాణికులు



రోడ్డా.. నీడి మడుగా..భారీ వర్షంతో జలమయమైన శ్రీకంఠం సర్కిల్

స్టోరేజీ సంపు వద్ద వ్యర్థాలు ఎలా ఉంచుతారు?

● ఇంజినీర్లపై మేయర్ వసీం ఆగ్రహం

అనంతపురం కార్పొరేషన్: బయోమైనింగ్ ద్వారా వేరు చేసిన వ్యర్థాలను సమ్మర్ స్టోరేజీ వద్ద ఎలా ఉంచుతారని, దీని ద్వారా నగరవాసులకు ఇబ్బంది కల్గడమేకాకుండా భవిష్యత్తులో భూగర్భ జలాలు కలుషితం అయ్యే ప్రమాదం ఉందని ఇంజినీర్లపై మేయర్ వసీం ఆగ్రహం వ్యక్తం చేశారు. మంగళవారం నగరపాలక సంస్థ ఎస్‌ఈ రాజశేఖర్ తదితరులతో కలసి మేయర్ సమ్మర్ స్టోరేజీని పరిశీలించారు. పీఏబీఆర్ నీటిని కెనాల్ ద్వారా ఎస్‌ఎస్ ట్యాంకులో ఏర్పాటు చేయబోతున్న సంపులోకి విడుదల చేసిన నీటిని శుద్ధి చేసి నగరంలోని పలు ప్రాంతాలకు తాగునీరు అందించేలా చర్యలు తీసుకోవాలన్నారు. బయోమైనింగ్ చేపడుతున్న కాంట్రాక్టర్ వ్యర్థాలను నగరానికి దూరంగా ఇబ్బంది లేని ప్రాంతాల్లో ఏర్పాటు చేసుకోవాలన్నారు. ఇష్టారాజ్యంగా నగరంలో వ్యర్థాలను ఎక్కడ పడితే అక్కడ వదేస్తే ఊరుకునేది లేదన్నారు. ఇంజినీర్లు క్షేత్రస్థాయి పర్యటన పేరుతో తప్పించుకుని తిరిగేది మానేసి ప్రజలకు ఉపయోపడే పనులపై దృష్టి సారిస్తే బాగుంటుందన్నారు. డీఈ సత్యనారాయణ, వైఎస్సార్‌సీపీ నాయకులు గంగాధర్, దాదాఖలందర్, కాకర్ల శ్రీనివాస్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



సమ్మర్ స్టోరేజీ సంపు వద్ద వ్యర్థాలను పరిశీలిస్తున్న మేయర్ వసీం

జర్నలిస్టుల సమస్యలు పరిష్కరించాలి

అనంతపురం అర్బన్: జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు ఇస్తామని ఎన్నికల్లో కూటమి ఇచ్చిన హామీని ప్రభుత్వం నిలబెట్టుకోవాలని ఏపీయూడబ్ల్యూజే నాయకులు డిమాండ్ చేశారు. జర్నలిస్టుల కోర్కెల దినం సందర్భంగా ఇన్‌చార్జి కలెక్టర్ శివ్ నారాయణ్ శర్మను మంగళవారం కలెక్టరేట్‌లోని ఆయన చాంబర్ వద్ద సంఘం నాయకులు కలిసి వినతిపత్రం అందజేశారు. జిల్లా అధ్యక్షుడు ప్రవీణ్ మాట్లాడుతూ పాత అక్రిడిటేషన్లను ఇప్పటికీ మూడుసార్లు పొడిగించారన్నారు. గడువు ఈనెల 31తో ముగుస్తున్నందున ఈసారైనా పొడిగించకుండా కొత్త అక్రిడిటేషన్లు ఇవ్వాలన్నారు. అక్రిడిటేషన్ కమిటీల్లో జర్నలిస్టుల సంఘాలకు ప్రాతినిధ్యం కల్పించాలన్నారు. హెల్త్ స్కీమ్‌ను మరింత ప్రయోజనకరంగా తీర్చిదిద్దాలనారు. ప్రమాద బీమా పథకాన్ని పునరుద్ధరించాలన్నారు. హామీ మేరకు ఇళ్లస్థలాలు ఇవ్వాలన్నారు. విశ్రాంత పాత్రికేయులకు పింఛన్ పథకాన్ని ప్రారంభించాలని డిమాండ్ చేశారు. ఐజేయూ సభ్యుడు ప్రభాకర్‌రాయుడు, సంఘం గౌరవాధ్యక్షుడు భోగేశ్వరరెడ్డి, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు కేపీ కుమార్, నాయకులు పూల చలపతి, బాలరంగారెడ్డి, నాయకులు అక్కులప్ప, చౌడప్ప, బాలమురళీ, డేవిడ్, జంబులరమేష్‌రెడడి, ఆనందవర్ధన్, శేషాద్రిశేఖర్, శ్రీనివాసులు, రమేష్‌కాంత్, మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.



ఇన్‌చార్జి కలెక్టర్‌కు వినతిపత్రం అందిస్తున్న ఏపీయూడబ్ల్యూజే నాయకులు

టీకాల కంటే విలువైనవి తల్లిపాలు



మాట్లాడుతున్న సీడీపీఓ ఉమాశంకరమ్మ



తల్లిపాలపై అవగాహన కల్పిస్తున్న అంగన్‌వాడీ సిబ్బంది

రాప్తాడు: టీకాల కంటే తల్లి ముర్రుపాలు ఎంతో విలువైనవని సీడీపీఓ ఉమా శంకరమ్మ అన్నారు. మంగళవారం ప్రసన్నాయపల్లి ప్రాథమిక పాఠశాల ఆవరణలోని అంగన్‌వాడీ కేంద్రంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ హేమలత ఆధ్వర్యంలో ప్రపంచ తల్లి పాల వారోత్సవాలను నిర్వహించారు. గ్రామంలో తల్లిపాల వారోత్సవాలపై ర్యాలీ నిర్వహించి, అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సీడీపీఓ మాట్లాడుతూ బిడ్డ పుట్టిన మరుక్షణమే బిడ్డకు తల్లి ముర్రు పాలు పట్టించడం వలన శిశువు ఆరోగ్యంగా ఎదగడానికి అవసరమైన పోషకాలు అందుతాయన్నారు. బాల్య వివాహాలతో అనేక అనర్థాలు తలెత్తుతాయని, వీటి నిర్మూలనకు అందరూ కృషి చేయాలన్నారు. అంగన్‌వాడీ కార్యకర్తలు సూర్యకళ, సరోజ, యల్లమ్మ, మాధవి, హెల్పర్స్ శ్రీలత, మల్లేశ్వరి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

తల్లిపాలతోనే బిడ్డకు సంపూర్ణ ఆరోగ్యం

అనంతపురం రూరల్: తల్లిపాలతోనే బిడ్డకు సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ జ్యోతి అన్నారు. మంగళవారం ఏ. నారాయణపురం పంచాయతీలోని రాయల్‌నగర్ అంగన్‌వాడీ కేంద్రంలో ప్రపంచ తల్లి వారోత్సవాలను నిర్వహించారు. తల్లిపాలతో కలిగే ప్రయోజనాలపై సూపర్‌వైజర్ జ్యోతి గర్భిణులు, బాలింతలకు అవగాహన కల్పించారు. అంగన్‌వాడీ కార్యకర్తలు సుజాత, రేణుక, మాధవి, రామాంజులమ్మ, హెల్పర్ పద్మావతి తదితరులు పాల్గొన్నారు.

స్మార్ట్ మీటర్లు పగులగొడతాం

రాప్తాడు: ప్రజల అనుమతి లేకుండా స్మార్ట్ మీటర్లను బిగిస్తే పగులగొడతామని సీపీఐ మండల కార్యదర్శి ఆర్.రవీంద్ర హెచ్చరించారు. స్మార్ట్ మీటర్లను వ్యతిరేకిస్తూ స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద మంగళవారం సీపీఐ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతిపక్షంలో ఉన్న సమయంలో ప్రస్తుత మంత్రి నారా లోకేష్ స్మార్ట్ మీటర్లను బిగిస్తే పగలగొట్టాలని పిలుపునిచ్చారని, ఇప్పుడు ఎందుకు ఏర్పాటు చేస్తున్నారన్నారు. స్మార్ట్ మీటర్లతో ప్రజలపై రెంట్ చార్జీల భారం పెరుగుతుందన్నారు. మొబైల్‌కు రీచార్జ్ చేసుకున్నట్లుగా రీచార్జ్ చేయించాల్సి ఉంటుందన్నారు. మీటర్‌కు అయ్యే రూ.17 వేలు కూడా ప్రజలే నెల నెలా కరెంట్ చార్జీల రూపంలో చెల్లించాల్సి ఉంటుందన్నారు. ప్రజలపై భారం వేసి ప్రజల డబ్బును అదానీకి దోచి పెట్టేందుకు కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం పూనుకుందని విమర్శించారు. కూటమి ప్రభుత్వం పెంచిన విద్యుత్ సర్దుబాటు చార్జీలను వెంటనే తగ్గించాలని డిమాండ్ చేశారు. నాయకులు వంశీ, ప్రసాద్, మధు, చంద్రశేఖర్, శాంతమ్మ, మనోహర్ తదితరులు పాల్గొన్నారు.

రాప్తాడురూరల్: ఎక్కడైనా స్మార్ట్‌మీటర్లు కనిపిస్తే పగులగొట్టాలని ప్రతిపక్షంలో ఉన్నప్పుడు పిలుపునిచ్చిన లోకేష్ అధికారంలోకి రాగానే అవి ముద్దయ్యాయా? అని సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి చిరుతల మల్లికార్జున మండిపడ్డారు. మంగళవారం సీపీఐ అనంతపురం రూరల్ మండల సమితి ఆధ్వర్యంలో బళ్లారి బైపాస్ సమీపంలోని విద్యుత్ సబ్ స్టేషన్ వద్ద ధర్నా చేపట్టారు. అనంతపురం రూరల్ మండల సహాయ కార్యదర్శి జి.దుర్గాప్రసాద్ అధ్యక్షతన జరిగిన ధర్నాలో సహాయ కార్యదర్శి మల్లికార్జున, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు పి.రామకృష్ణ రాప్తాడు నియోజకవర్గ కార్యదర్శి ఎం.రమేష్ మాట్లాడారు. సీపీఐ నాయకులు శ్రీకాంత్, రైతు సంఘం జిల్లా నాయకులు పి. వన్నారెడ్డి , చేతివృత్తి దారుల సమాఖ్య నాయకులు పోతులయ్య, యువజన సమాఖ్య నియోజకవర్గ కార్యదర్శి ధనుంజయ, రాము, మన్నీల వెంకటరాముడు, గోవిందు, రెడ్డప్ప, అక్కులన్న పాల్గొన్నారు.



అనంతపురంలో నిరసన తెలియజేస్తున్న సీపీఐ నాయకులు

ఆత్మకూరు: కూటమి ప్రభుత్వం పెంచిన విద్యుత్ చార్జీలు రద్దు చేయాలని సీపీఎం మండల కార్యదర్శి శివశంకర్ డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక ట్రాన్స్‌కో కార్యాలయం వద్ద సీపీఎం నాయకులచే నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ స్మార్ట్ మీటర్లతో షాపులు, ఇళ్లకు మూడు రెట్లు విద్యుత్ బిల్లులు వస్తున్నాయన్నారు. ఇళ్లకు స్మార్ట్ మీటర్లు బిగించడం ఆపాలని డిమాండ్ చేశారు. అనంతరం విద్యుత్ సిబ్బందికి వినతిపత్రం అందజేశారు. సీపీఎం నాయకులు రామయ్య, జయమ్మ, రాము, చౌడప్ప, మహేష్ , తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీలకు 5జీ ట్యాబ్‌లందించాలి

అనంతపురం సెంట్రల్: అంగన్‌వాడీల నిర్వహణకు 5జీ నెట్‌వర్క్‌తో కూడిన ట్యాబ్‌లను అందించాలని అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం అనంతపురం అర్బన్ ప్రాజెక్టు పరిధిలోని వర్కర్లు గతంలో ఇచ్చిన సెల్‌ఫోన్‌లను సీడీపీఓ కార్యాలయంలో తిరిగి అప్పగించారు. ఈ సందర్భంగా యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి రమాదేవి, గౌరవాధ్యక్షుడు నాగేంద్రకుమార్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన సెల్‌ఫోన్లలో అన్ని యాప్‌లు పని చేయడం లేదన్నారు. సెంటర్ నిర్వహణ, ఇతర యాప్‌లను కలిపి ఒకే యాప్‌గా ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. సమ్మె కాలంలో అంగన్‌వాడీ సిబ్బందికి ఇచ్చిన హామీలు నేటికీ అమలు కాలేదన్నారు. ఐదేళ్లుగా వేతనాలు పెంచలేదని ఆవేదన వ్యక్తం చేశారు. వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో అమలు చేస్తున్న ప్రధాన మంత్రి మాతృవందన యోజన పథకం అంగన్‌వాడీ వర్కర్లను చేయమని చెప్పడం సరికాదన్నారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు హరిప్రియ, సంధ్య, సుభాషిణి పాల్గొన్నారు.



సెల్‌ఫోన్లు తిరిగి ఇచ్చేస్తున్న అంగన్‌వాడీ వర్కర్లు

76 బస్తాల రేషన్ బియ్యం స్వాధీనం

అనంతపురం: అనంతపురం నుంచి పావగడకు తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని వన్‌టౌన్ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ముందస్తు సమాచారం మేరకు పోలీసులు మంగళవారం ఉదయం ఎన్టీఆర్ మార్గ్ వద్ద రెండు వాహనాల్లో తరలిస్తున్న 76 బస్తాల రేషన్ బియ్యాన్ని పట్టుకుని సీజ్ చేశారు. ఈసందర్భంగా బియ్యం తరలిస్తున్న నగరానికి చెందిన సుబ్రమణ్యం, తరుణ్‌తేజ్, ప్రకాష్‌ను అరెస్ట్ చేసి కేసు నమోదు చేసినట్లు వన్‌టౌన్ ఎస్‌ఐ శ్రీనివాసులు తెలిపారు.

కుటుంబ కలహాలతో యువకుడి ఆత్మహత్య



తలారి శివశంకర్ (ఫైల్)

రాప్తాడురూరల్: కుటుంబ కలహాలతో ఓ యువకుడు మంగళవారం విషద్రావకం తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. స్థానికులు తెలిపిన వివరాలు..అనంతపురం రూరల్ మండలం ఉప్పరపల్లికి తలారి శివశంకర్ (28), శివమణి దంపతులు. వీరికి ఒక కుమారుడు, కూతురు సంతానం. శివశంకర్ ట్రాక్టర్ డ్రైవర్‌గా పని చేసేవాడు. కుటుంబ సమస్యలతో కొద్దిరోజులుగా భార్యభర్తల మధ్య మనస్పర్థలు ఏర్పడ్డాయి. మంగళవారం ఉదయం ఇంటి నుంచి బయటకు వెళ్లిన శివశంకర్ ఊరి శివారులోని ఓ వ్యవసాయ పొలానికి వెళ్లి విషద్రావకం తాగి తల్లికి ఫోన్ చేసి తాను చనిపోతున్నట్లు చెప్పి మొబైల్ స్విచ్ఛాఫ్ చేశాడు. కంగారుపడ్డ తల్లి, కుటుంబ సభ్యులు గాలింపు చేపట్టగా ఓ చేనులో అపస్మారక స్థితిలో పడిఉన్నాడు. వెంటనే అతడిని ప్రభుత్వ సర్వజన ఆస్పత్రికి తరలించారు. తర్వాత కర్నూలు ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ సాయంత్రం మృతి చెందాడు. కాగా అందరితో బాగా కలుపుగోలుగా ఉండే శివశంకర్ ఇలా బలవన్మరణానికి పాల్పడడంతో గ్రామంలో విషాదచాయలు నెలకొన్నాయి.

ఆధునిక పద్ధతులతో అధిక దిగుబడులు

రాప్తాడు: ఆధునిక పద్ధతులతో అధిక దిగుబడులు సాధ్యమని ఏఓ కృష్ణచైతన్య పేర్కొన్నారు. మంగళవారం రాప్తాడు, గంగలకుంట గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఓ మాట్లాడుతూ రైతులు రసాయన ఎరువుల వాడకం తగ్గించి జీవన ఎరువులు వాడుకోవాలన్నారు. ఘన, ద్రవ, బీజ జీవామృతం, వేప గింజల కషాయం వీటిని తయారు పంటలకు వాడితే పంటలు మంచి దిగుబడి వస్తుందని చెప్పారు. ఆముదం, కంది పంటను ఆశించే చీడపీడలు, తెగుళ్ల నివారణకు రైతులు సమగ్ర సస్యరక్షణ చర్యలు చేపట్టాలన్నారు. అన్నదాత సుఖీభవకి సంబంధించి అర్హత ఉండి, జాబితాలో అనర్హులుగా వచ్చిన రైతులు రైతు సేవా కేంద్రాలు, ఆన్‌లైన్‌లో అర్జీలు పెట్టుకోవాలన్నారు. కౌలు రైతులు కార్డులు చేయించుకోవాలని సూచించారు. మార్కెట్ యార్డ్ వైస్ చైర్మన్ క్రిష్ణ, ఏఈఓలు సుజిత, రంజిత, రైతు సేవా కేంద్ర సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.



కంది పంట సాగుపై అవగాహన కల్పిస్తున్న ఏఓ కృష్ణ చైతన్య

రేపు 'మనమెరగని లాటిన్ అమెరికా' పుస్తక పరిచయ సభ

అనంతపురం కల్చరల్: విద్వాన్ విశ్వం విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో గురువారం దాసరి అమరేంద్ర రాసిన 'మనమెరగని లాటిన్ అమెరికా' పుస్తక పరిచయ సభ ఉంటుంది. సాయంత్రం 5.30 గంటలకు స్థానిక ఎన్జీవో హోమ్‌లో జరిగే సమావేశానికి అందరూ రావాలని నిర్వాహకులు రాజీమోహన్, డాక్టర్ ప్రగతి కోరారు.

కోవిడ్ వార్డు లేకున్నా స్టాఫ్‌నర్సుల కేటాయింపు

అనంతపురం మెడికల్: సర్వజనాస్పత్రిలో కోవిడ్ వార్డు లేకున్నా ముగ్గురు స్టాఫ్‌నర్సులను కేటాయించడం వివాదాస్పదంగా మారింది. ఇప్పటికే సర్వజనాస్పత్రిలోని వివిధ వార్డుల్లో స్టాఫ్‌నర్సుల నియామకం సరిగా జరగడం లేదన్న విమర్శలున్నాయి. కోవిడ్ వార్డులో ప్రస్తుతం రోగులు లేకున్నా ఆ వార్డు పర్యవేక్షణకు హెడ్‌నర్సుగా సుభద్రమ్మ, స్టాఫ్‌నర్సులుగా ఫక్రున్నీస, చిట్టి, శైలజను నియమించారు. కాగా ఇటీవల ఇంజెక్షన్ వార్డులోనూ స్టాఫ్‌నర్సును కేటాయించలేదు. అక్కడ నర్సింగ్ విద్యార్థిని ఉంచిన విషయం విదితమే. కేవలం ఉదయం షిఫ్ట్‌లోనే వివిధ వార్డులకు కేటాయించిన స్టాఫ్‌నర్సులను కాకుండా పదుల సంఖ్యలో రిలీవర్ల పేరుతో స్టాఫ్‌నర్సులను కేటాయించారు. కాగా వారిలో చాలా మంది పూర్తి స్థాయిలో విధులు చేపట్టడం లేదన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. అవసరం ఉన్న వార్డుల్లో స్టాఫ్‌నర్సులను కేటాయించకుండా నర్సింగ్ సూపరింటెండెంట్లు బాధ్యతారాహిత్యంగా వ్యవహరిస్తున్నారన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

ఎక్స్‌రేలో 'డేంజర్ బెల్స్'



ఎక్స్‌రే గది 29లో కాలం చెల్లిన బ్యాటరీని ప్యానెల్‌కు వినియోగిస్తున్న దృశ్యం

అనంతపురం మెడికల్: ప్రభుత్వ సర్వజనాస్పత్రిలోని ఎక్స్‌రే విభాగంలో డేంజల్ బెల్స్ మోగే పరిస్థితి నెలకొంది. రేడియాలజీ విభాగానికి సంబంధించి రూం నెంబర్ 29లో ఎక్స్‌రే మిషన్‌కు వినియోగిస్తున్న ప్యానెల్ బోర్డులోని బ్యాటరీకి కాలం చెల్లింది. అనేకసార్లు రేడియాలజీ విభాగం వైద్యులు, సిబ్బంది ఆస్పత్రి ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లినా ప్రయోజనం లేకుండా పోయింది. కాలం చెల్లిన బ్యాటరీ కావడంతో అది ఎప్పుడు పేలుతుందోనన్న భయం నెలకొందని రేడియాలజీ విభాగంలోని పలువురు వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు కొత్త బ్యాటరీ ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

పట్టణ ఆరోగ్య కేంద్రం తనిఖీ



సిబ్బందితో మాట్లాడుతున్న డీఎంహెచ్‌ఓ డాక్టర్ ఈ భ్రమరాంబ దేవి

అనంతపురం మెడికల్: నగరంలోని రెండో రోడ్డులో ఉన్న పట్టణ ఆరోగ్య కేంద్రాన్ని డీఎంహెచ్ఓ డాక్టర్ ఈ భ్రమరాంబ దేవి మంగళవారం తనిఖీ చేశారు. అక్కడ వైద్యులు, సిబ్బంది సమయపాలన పాటిస్తున్నారా?లేదానని ఆరాతీశారు. ఆరోగ్య కేంద్రానికి వచ్చిన రోగులకు సకాలంలో వైద్య సేవలందించేలా చూడాలని డీఎంహెచ్ఓ సిబ్బందిని ఆదేశించారు. రోగులకు అందిస్తున్న సేవల వివరాలను ఎప్పటికప్పుడు పోర్టల్‌లో నమోదు చేయాలన్నారు.

అధ్వానంగా ఎంఎస్ 6 వార్డు



ఎంఎస్ 6, ల్యాబ్‌కు మధ్యలో ఉన్న డోర్ దుస్థితి

అనంతపురం మెడికల్: ప్రభుత్వ సర్వజనాస్పత్రిలోని కొన్ని వార్డులు అధ్వానంగా తయారయ్యాయి. ఆస్పత్రిలోని సర్జరీ విభాగానికి సంబంధించి ఎంఎస్ 6 వార్డును చూస్తే పరిస్థితి ఎంత దారుణంగా ఉందో అర్థమవుతుంది. ఎంఎస్ 6, పెథాలజీ ల్యాబ్ మధ్యలో డోర్ సరిగా లేదు. రాత్రి వేళలో ఎవరైనా గుర్తు తెలియని వ్యక్తులు ల్యాబ్ నుంచి వచ్చి ఏమైనా మందులు ఎత్తుకెళ్లినా.. రోగులు, స్టాఫ్‌నర్సులకు సంబంధించిన వస్తువులను దొంగించుకెళ్లేలా వార్డు ఉంది. ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఆత్మారాం, ఆర్ఎంఓ డాక్టర్ రామకృష్ణ, తదితర అధికారులు కనీసం వివిధ వార్డుల్లో నెలకొన్న చిన్నపాటి సమస్యలను పరిష్కరించలేని నిస్సహాయ స్థితిలో ఉన్నారన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఇప్పటికైనా అధికారులు మేలుకుని సమస్యలపై దృష్టి సారిస్తే బాగుంటుందని ఆస్పత్రి వర్గాలంటున్నాయి.

బ్యాంకు లోను పేరుతో మోసగించిన వ్యక్తిపై కేసు

అనంతపురం: 'బ్యాంకు లోను పేరుతో మోసగించిన వ్యక్తిపై పోలీసులు కేసు నమోదు చేశారు. వివరాలు.. నగరంలోని మూడో రోడ్డులో నివాసం ఉండే పి.రఘునాథ గతంలో కదిరి లక్ష్మీ నరసింహ స్వామి దేవస్థానంలో నాదస్వరం వినిపించే ఉద్యోగం చేస్తున్నాడు. ఆ సమయంలో రఘునాథకు అనంతపురానికి చెందిన సతీష్‌కుమార్ అనే వ్యక్తి పరిచయం అయ్యాడు. అనంతపురంలో ఇల్లు కొనుగోలు నిమిత్తం హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకులో లోను ఇప్పిస్తానని , ప్రాసెస్ చేయడానికి రూ.6 లక్షల నగదు కావాలని కోరారు. విడతల వారీగా రూ.6 లక్షల నగదు ఇచ్చారు. తిరిగి లోను మంజూరు కావాలంటే ఏదైనా షూరిటీ కావాలని చెప్పి.. 5 తులాల బంగారు తీసుకున్నాడు. అప్పటి నుంచి ఫోను లిఫ్ట్ చేయడం లేదు. ఈ ఏడాది ఏప్రిల్ 26న సతీష్ కుమార్ కనిపంచగా రూ.6 లక్షలు బాకీ ఉన్నట్లు అగ్రిమెంట్ ఇచ్చాడు. అప్పటి నుంచి ఫోన్లు లిఫ్ట్ చేయడం లేదు. దీంతో తమను మోసం చేసిన వ్యక్తిపై చర్యలు తీసుకోవాలని రఘునాథ భార్య ప్రొద్దుటూరు లక్ష్మీదేవి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు త్రీ టౌన్ సీఐ కే. శాంతిలాల్ తెలిపారు.